Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 03.05.2019, శుక్రవారం సంపుటి : 38 సంచిక : 48 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com

# బాబు దుబారాతో రాష్ట్రం దివాలా



ఇద్దరు అన్నదమ్ములు వేరు కాపురం పెట్టారు. తండ్రి ఆస్థిలో పెద్దవాటాను చిన్న కొడుక్కి ఇచ్చి, తక్కువ వాటాను పెద్ద కొడుక్కి ఇచ్చి అన్యాయం చేసాడనే అనుకుందాం. ఆస్థి పంపకాలలో ఒక కోటి రూపాయల దాకా వచ్చింది. ఈ కోటితో వేరుగా వచ్చేశాం... దీని తర్వాత ఏం చేయాలి...? పొలం కొని వ్యవసాయం చేసుకుంటే జీవనం గడుస్తుంది. లేకుంటే పెట్టుబడి పెట్టి ఏదన్నా వ్యాపారం చేసి కష్టపడితే నాలుగు రూపాయలొస్తాయి. అలా చేయకుండా పాతికలక్షలతో ఒక బంగ్లాకొని, ఇంకో పాతిక లక్షలకు కారు కొని రోజూ కారులో తిరుగుతూ బంగ్లాలో ఏసి వేసుకుని పడుకుంటుంటే... మిగిలిన 50లక్షలు కళ్ళ ముందే కరిగిపోతాయి. అంతేకాదు, జల్సాల కోసం కొత్తగా అప్పులు చేయాల్సి వస్తుంది. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ పరిస్థితి ఇలానే వుంది.

- అవస్థల పాలవనున్న ఆంధ్రా ఆర్థిక వ్యవస్థ
- రాష్ట్రంపై రెండున్నర లక్షల కోట్ల అప్ప
- జీతాలకు కూడా అప్పలు చేయాల్సిన దుస్థితి
- కొత్త ప్రభుత్వం ముందు 'కోట్ల' సవాళ్ళు

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అవస్థల పాలైంది. ఖజానా ఖాళీ అయిపోయింది. వచ్చేనెల ఉద్యోగుల జీతాలకు కూడా దిక్కులేదు. వేలకోట్ల బిల్లులు పెండింగ్‌లో వున్నాయి. కాంట్రాక్టర్లకు చెల్లింపులు ఆగిపోయాయి. రాష్ట్రంలో జరుగుతున్న పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయి?

అసలు రేపు 23వ తేదీ తర్వాత ఏర్పడబోయే ప్రభుత్వం ఈ ఆర్థిక కష్టాలను ఎంతవరకు అధిగమించగలదనేది పెద్ద ప్రశ్న! రేపు ఏ ప్రభుత్వమైనా రావచ్చు. చంద్రబాబే మళ్ళీ ముఖ్యమంత్రి కావచ్చు... లేదంటే ప్రతిపక్షంగా వున్న వైసిపి అధికారంలోకి రావచ్చు. ఎవరు అధికారంలోకి వచ్చినా ప్రభుత్వాన్ని ఏ విధంగా నడపాలనేది పెద్ద సందేహంగా మారనుంది. రాష్ట్రంలో ఏ పని జరగాలన్నా నిధులు అవసరం. ఎన్నికలలో అటు చంద్రబాబుగాని, ఇటు జగన్‌గాని నాలుకకు నరం లేదన్నట్లుగా ఉచిత హామీలిచ్చారు. పింఛన్‌లు, పసుపు కుంకుమ, డ్వాక్రా ఋణాల మాఫీ, ఫీజుల చెల్లింపు, నిరుద్యోగభృతి, రైతుకు పెట్టుబడిసాయం... ఇవన్నీ కూడా నేరుగా లబ్దిదారులకు డబ్బులిచ్చే కార్యక్రమాలు. వీటన్నింటిని అమలు చేయాలంటే దేశ బడ్జెట్‌ను ఒక్క ఏపికే కేటాయిస్తే సరిపోతుందేమో!? రేపు ఎవరు అధికారంలోకి వచ్చినా వీటన్నింటిని అమలు

(మిగతా 11వ పేజీలో)



## ఆ(వే)ట మొదలైంది

అరెస్ట్‌కు భయపడి హైకోర్టును ఆశ్రయించిన పందుల వీరుడు

11లో



## సంస్మరణ

సామాన్యులను నాయకులుగా మలచిన
రాజకీయ యోధుడు
పేద, దళిత, బడుగు, బలహీన వర్గాల
జనబాంధవుడు
రాజకీయాలలో తనదైన ముద్రవేసుకున్న
ప్రజానాయకుడు
మాజీ ముఖ్యమంత్రి
**శ్రీ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి గారు**
స్వర్గస్తులై తేది.09.05.2019 నాటికి
ఐదేళ్ళు గడవనున్న సందర్భంగా
వారి జ్ఞాపకాలను స్మరించుకుంటూ...

**నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి**
ఛైర్మెన్, నేదురుమల్లి ఫౌండేషన్



సభలో ప్రసంగిస్తున్న సికాస నెల్లూరు బ్రాంచ్ అధ్యక్షుడు చిన్ని శ్రావణ్‌కుమార్

## సులభతరంగా జిఎస్‌టి

ప్రవేశపెట్టిన కొత్తల్లో ఎంతో కఠినతరంగా కనిపించిన జిఎస్‌టిని ఇప్పుడు ప్రభుత్వం సులభతరం చేయడానికి కసరత్తు ప్రారంభించిందని జిఎస్‌టి అసిస్టెంట్ కమిషనర్ శివప్రసాద్ పేర్కొన్నారు. ఈ నెల 1వ తేదీన నెల్లూరులోని హోటల్ అతిథి గ్రాండ్ కాన్ఫరెన్స్ హాల్లో సౌత్ ఇండియా చార్టెర్డ్ అకౌంటెంట్స్ స్టూడెంట్స్ అసోసియేషన్ (సికాస) ఆధ్వర్యంలో సిఏ విద్యార్థులు, చార్టెర్డ్ అకౌంటెంట్లతో నిర్వహించిన సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. జిఎస్‌టిని ప్రభుత్వం కీలకమైన ఆదాయ వనరుగా భావిస్తుందని, ఇందుకోసం వ్యాపారులు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని, జిఎస్‌టిపై వున్న అపోహలను తొలగించడానికి చార్టెర్డ్ అకౌంటెంట్లు ప్రముఖ పాత్ర వహించాలని ఆయన కోరారు. జిఎస్‌టితో భవిష్యత్‌లో వ్యాపారవర్గాలకు ఎంతో భరోసా లభిస్తుందన్నారు. విశాఖపట్నం నుండి విచ్చేసిన ప్రముఖ చార్టెర్డ్ అకౌంటెంట్ మద్ది రాజేష్ జిఎస్‌టి వార్షిక రిటర్న్ ఆడిట్‌పై విపులంగా వివరించారు. సభికులు అడిగిన ప్రశ్నలకు ఆయన ఎంతో విశ్లేషణాత్మకంగా వివరణ ఇచ్చారు. సికాస నెల్లూరు బ్రాంచ్ అధ్యక్షుడు చిన్ని శ్రావణ్‌కుమార్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది.

### అత్యుత్తమ సేవలందించిన వారికి

## ప్రోత్సాహక బహుమతులు



సత్కారాలందుకున్న అత్యుత్తమ సేవలందించిన ప్రభుత్వోద్యోగులు

ప్రభుత్వ శాఖలలో పనిచేస్తూ అత్యుత్తమ సేవలందించిన వారికి నెల్లూరు రోటరీ క్లబ్ వారు 2018-19 సంవత్సరానికి గాను 6 మంది ఉద్యోగులను ఎంపిక చేసి నగదు బహుమతులతోబాటు ప్రశంసాపత్రం, జ్ఞాపికతో సత్కరించారు. ఈనెల 1న నెల్లూరు రోటరీ క్లబ్ లో జరిగిన కార్యక్రమంలో 108 సర్వీసులో పనిచేస్తున్న శ్యామ్ బాబు, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో పనిచేస్తున్న నర్స్ టి.రేవతిదేవి, ట్రాఫిక్ కానిస్టేబుల్ పి. రాజారాం, ఏపియస్ ఆర్టీసీ డ్రైవర్ షేక్ హసన్‌అహమద్, నెల్లూరు నగర కార్పొరేషన్ డ్రైనేజీ వర్కర్ టి.పోలయ్య, పోస్ట్‌మాన్ పి. నాగేశ్వరరావులను సత్కరించారు. రొటేరియన్స్ పి. శ్రీనివాసులురెడ్డి, డాక్టర్ దొరస్వామినాయుడు, కె.ప్రతాప్‌కుమార్‌రెడ్డి, కెవి సుబ్రహ్మణ్యం, బి. నరేష్ చంద్రారెడ్డి, కెవి చలమయ్య సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

## అరుణమ్మ స్మారకంగా అన్నదానం




జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా సుదీర్ఘకాలం పనిచేసిన స్వర్గీయ శ్రీమతి పందిళ్ళపల్లి అరుణమ్మ 66వ జయంతి సందర్భంగా ఈ నెల 2వ తేదీన నెల్లూరులోని డిఎస్ఆర్ ప్రభుత్వ ఆసుపత్రిలో శ్రీ సత్యసాయి అన్నదాన సమాజం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ డిప్యూటీ గవర్నర్ పందిళ్ళపల్లి పట్టాభిరామిరెడ్డి, ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నలుబోలు బలరామయ్యనాయుడు, పందిళ్ళపల్లి హేమంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆశ నిరాశల మధ్య అభ్యర్థులు

## గూడూరు — జంపింగ్‌కు కటింగేనా?



గత ఐదేళ్లలో వైసిపి నుండి గెలిచి తెలుగుదేశంలో చేరిన ఎమ్మెల్యేలు 23 మంది వుంటే, వారిలో నెల్లూరుజిల్లా నుండి వున్న ఒకే ఒక ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్. 2014లో గూడూరు నుండి వైసిపి ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన రెండేళ్లకే జెండా మార్చి తెలుగుదేశంలో చేరాడు. సిటింగ్ ఎమ్మెల్యేగా గూడూరు నుండి తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేస్తున్నాడు. వైసిపి నుండి గెలిచి టిడిపిలో చేరడం అనే చర్యను రాజకీయాలకతీతంగా ఎవరూ హర్షించరు. ఆమోదించరు. కాబట్టి ఈ చర్యతో సహజసిద్ధంగానే నియోజకవర్గంలో ఆయనపై వ్యతిరేకత వుంటుంది. ఎన్నికల్లో దీని ప్రభావం ఖచ్చితంగా పని చేస్తుంటుంది.

వైసిపి అభ్యర్థిగా తిరుపతి మాజీఎంపి వెలగపూడి వరప్రసాద్ పోటీ చేశాడు. ఈ నియోజకవర్గానికి ఎంపీగా సుపరిచితుడే! అవినీతి ఆరోపణలు లేవు. మంచివాడిగా పేరుంది.



పార్టీల బలాబలాలకొస్తే నియోజకవర్గంలో పేరుమోసిన రాజకీయ కుటుంబాలన్నీ వైసిపిలోనే వున్నాయి. గూడూరు పట్టణంలో గతంలో తెలుగుదేశం బలంగా వుండేది. ఇప్పుడు ఇక్కడకూడా వైసిపికే మెజార్టీ రావచ్చనే అభిప్రాయముంది. కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు మండలాలలో వైసిపి బలంగానే వుందని, కేడర్ పటిష్టంగా పని చేసిందని తెలుస్తోంది. గూడూరు వైసిపి అభ్యర్థిగా వరప్రసాద్ విజయానికి తిరుగులేదనే ధీమా పార్టీ వర్గాలలో వ్యక్తమవుతోంది.

ఆశలు, అవకాశాల విషయంలో తెలుగుదేశం అభ్యర్థి పాశం సునీల్‌కుమార్ చాలాదూరంలోనే వున్నాడని చెప్పొచ్చు. చంద్రబాబు తాత్కాలిక తాయిలాల పట్ల ప్రజలు ఆకర్షితులు కావడం, పాశం సునీల్ ఏవన్నా మంచి పనులు చేసుండి, వాటి పట్ల ప్రజలు రియాక్ట్ కావడం వంటి అద్భుతాలు జరిగితే ఇక్కడ తెలుగుదేశం గెలవడానికి ఛాన్సుంది.

## సూళ్ళూరుపేట — వైసిపికి పెట్టని కోట



చంద్రబాబునాయుడు పోటీ చేస్తున్న కుప్పం నియోజకవర్గంపై వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ వాళ్ళు ఆశలు పెట్టుకోరు. వై.యస్. జగన్మోహన్‌రెడ్డి పోటీలో వున్న పులివెందులపై తెలుగుదేశం వాళ్ళకు ఆశలుండవు. ఆ నియోజకవర్గాల స్వభావమది. యాదృచ్ఛికమో, స్థానిక పరిస్థితుల ప్రభావమో ఏమోగాని నెల్లూరుజిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గం కూడా ఈ ఎన్నికల్లో అదే కోవలోకి చేరింది. ఎన్నికలకు ముందునుండే ఈ నియోజకవర్గం వైసిపికి నమ్మకమైన జాబితాలో చేరిపోయింది. నెల్లూరుజిల్లాలోనే కాదు రాష్ట్రంలోనే వైసిపి గెలవబోయే టాప్‌టెన్ సీట్లలో సూళ్లూరుపేట స్థానం సంపాదించుకుంది.

సూళ్లూరుపేట సిటింగ్ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య నాయకత్వం, ఆయన వ్యక్తిత్వం ఇక్కడ పార్టీకి తిరుగులేని ఆధిపత్యాన్ని అందించింది. సంజీవయ్య ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఈ 5ఏళ్లు పోరాడాడు. ప్రజలలో వున్నాడు. ప్రజలతో నడిచాడు. ప్రజల కోసం పనిచేశాడు. వివాదరహితుడిగా, అందరితో కలుపుగోలుగా వ్యవహరించే మనిషిగా, వినయ, విధేయతలు కలిగిన మనిషిగా మంచిపేరు తెచ్చుకున్నాడు. "ఎక్కడ నెగ్గాలో కాదు, ఎక్కడ తగ్గాలో తెలిసినోడే గొప్పోడు" అనే 'అత్తారింటికి దారేది' సినిమాలోని డైలాగ్‌ను ఈ ఐదేళ్లలో బాగా వంటబట్టించుకున్నాడు. రాజకీయాలకతీతంగా నియోజకవర్గంలో అందరితో సన్నిహిత సంబంధాలు కొనసాగించాడు. ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గంలో అగ్రవర్ణ నాయకులకంటే మెండుగా ప్రజాభిమానం సంపాదించుకున్నాడు. సంజీవయ్యకు ధీటైన అభ్యర్థిని నిలబెట్టడం కోసం తెలుగుదేశం వాళ్ళు చాలారోజులు అన్వేషణ సాగించారంటే సంజీవయ్య ఎంతగా మంచిపేరు తెచ్చుకున్నాడో అర్ధమవుతుంది. దీనికితోడు నియోజకవర్గంలో పార్టీకి వున్న ఆదరణ సంజీవయ్యను గెలుపు గుర్రమెక్కించాయనే చెప్పవచ్చు. ఎందుకంటే జిల్లాలో ఎన్నికల రోజునే తెలుగుదేశం నాయకులు గెలుపుపై ఆశలు వదులుకున్న తొలి నియోజకవర్గం ఇదే!



ఒకప్పుడు ఈ నియోజకవర్గం తెలుగుదేశంకు కంచుకోట. 1983 నుండి ఐదుసార్లు ఇక్కడ టీడీపీ గెలిచింది. అలాంటి నియోజకవర్గంలో ఆ పార్టీ బలహీనపడిందంటే కారణం పార్టీ అధిష్టానమే! సూళ్లూరుపేటపై గతంలో వేనాటి సోదరుల పెత్తనం వుండేది. ఆ తర్వాత పెత్తందారులు ఎక్కువయ్యారు. ఏక నాయకత్వం లేకుండాపోయింది. 1994 నుండి వరుసగా పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పరసా రత్నం అంటే కూడా ప్రజల్లో బోర్ కొట్టింది. సరైన అభ్యర్థి లేక, నాయకత్వం చెల్లాచెదురై ఇక్కడ తెలుగుదేశం కోరి కష్టాలను తెచ్చుకుంది.

## వెంకటగిరి — గిరి కిరీటధారి ఎవరు?



ఒకప్పుడు నల్లపరెడ్డు, నేదురుమల్లి కుటుంబాల రాజకీయ యుద్ధానికి వేదికైన వెంకటగిరిలో ఈసారి రసవత్తర పోటీ నడిచింది. హ్యాట్రిక్ విజయంతో వెంకటగిరి రాజకీయ చరిత్రలో సెన్సేషన్ సృష్టించాలని టిడిపి నుండి సిటింగ్ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మళ్ళీ అభ్యర్థిగా బరిలోకి దిగాడు. పదేళ్ళుగా ఆయన వెంకటగిరి ఎమ్మెల్యేగా వున్నాడు. మొదటి ఐదేళ్లలో ఆయనపై వ్యతిరేకత లేదుగాని, రెండో దఫా ఐదేళ్లలో మాత్రం ప్రజల్లో బాగా వ్యతిరేకత వచ్చింది. ఒక దశలో ఆయనకు సీటు కూడా అనుమానంగానే వుండింది. అయితే ఆయనకు మించిన నాయకుడు కానరాకపోవడంతో ఆయననే అభ్యర్థిగా నిర్ణయించక తప్పలేదు.

వైసిపి అభ్యర్థిగా ఆనం రామనారాయణరెడ్డి రావడం ఇక్కడ పార్టీకి మంచి ఊపు తెచ్చింది. వెంకటగిరి అసెంబ్లీ నుండి పోటీ చేయడం ఆయనకు మొదటిసారే కావచ్చు. కాని, ఈ నియోజకవర్గంలోని కలువాయి, రాపూరు, సైదాపురం వంటి మండలాలు ఆయనకు కొత్తకాదు. 2009కు ముందు అవి రాపూరు నియోజకవర్గంలోని మండలాలే కావడంతో నాయకుల్లోకి, ప్రజల్లోకి చొచ్చుకుపోవడం ఆయనకు సులభమైంది. రామనారాయణకు పరిస్థితులు కూడా బాగానే కలిసొచ్చాయి. నియోజకవర్గంలో బలమైన వర్గాలైన నేదురుమల్లి, వెంకటగిరి రాజాలు ఆయనకు సంపూర్ణ మద్దతుపలికారు. ఇక వెంకటగిరి మున్సిపల్ ఛైర్‌పర్సన్ దొంతు శారద వైసిపిలో చేరడం ఆనంకు కలిసొచ్చింది. 2014 ఎన్నికల్లో వెంకటగిరి పట్టణంలో మైనస్‌లో పడబట్టే అప్పుడు వైసిపి అభ్యర్థిగా పోటీ చేసిన కొమ్మి లక్ష్మయ్యనాయుడు ఓడిపోయాడు. కాని, ఈసారి ఆనం రామనారాయణరెడ్డి మండలాలతో పాటు వెంకటగిరి పట్టణంపై కూడా పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాడు. ఆర్థికంగా కూడా ప్రత్యర్థికి ఏమాత్రం తగ్గలేదు.



వైసిపి జిల్లాలో బలంగా నమ్మకం పెట్టుకున్న స్థానాలలో వెంకటగిరి అగ్రభాగాన వుంది. వెంకటగిరి మున్సిపాల్టీలో బీసీలు ఈసారి వైసిపి వైపు మొగ్గుచూపారని భావిస్తున్నారు. రాపూరు, కలువాయి, సైదాపురం మండలాలలో కూడా వైసిపికి మంచి మెజార్టీ రావొచ్చని అంచనా! డక్కిలి, బాలాయపల్లి మండలాలలో ఇరు పార్టీలకు పెద్దగా మెజార్టీ రాకపోవచ్చని, ఓవరాల్‌గా వైసిపిదే గెలుపు అనే ధీమా ఇక్కడ ఎక్కువుగా కనిపిస్తోంది.

తెలుగుదేశం అభ్యర్థి రామకృష్ణ చంద్రబాబు ఆకర్షణ పథకాలతో పాటు, తాను లోకల్ అన్న ప్రచారం కూడా తనను గెలిపిస్తుందని నమ్ముతున్నాడు. బిసిలు తనకే అండగా నిలిచారనే నమ్మకం ఆయనలో వుంది. వెంకటగిరి మున్సిపాల్టీ, మండలాలతో పాటు డక్కిలి, బాలాయపల్లి, కలువాయి, సైదాపురం మండలాలలో తనకే మెజార్టీ వస్తుందనే ఆశ వుంది. అయితే గెలుపుపై వైసిపి శ్రేణుల్లో వున్నంత ధీమా ఇక్కడ టీడీపీ వర్గాలలో లేదు.

# కౌంటింగ్‌కు కసరత్తు



ఎన్నికల ఫలితాలకు సరిగ్గా ఇక 20రోజులే వుండడంతో జిల్లా అధికార యంత్రాంగం కౌంటింగ్ ఏర్పాట్లపై కసరత్తు మొదలుపెట్టింది. ఇందుకోసం అనుభవం వున్న 1200మంది దాకా సిబ్బందిని సిద్ధం చేస్తోంది. నెల్లూరులో అటు డికెడబ్ల్యు కళాశాలలో నెల్లూరు లోక్‌సభ, దాని పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలలో, అలాగే కనుపర్తిపాడులోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కాలేజీలో తిరుపతి లోక్‌సభ దాని పరిధిలో ఏడు అసెంబ్లీ స్థానాల కౌంటింగ్ జరుగనుంది. ఒక్కో నియోజకవర్గానికి పది టేబుల్స్ ఏర్పాటు చేయాలని, ఒక్కో రౌండ్‌లో 14 ఈవిఎంలను లెక్కపెట్టాలని నిర్ణయించారు. ఉదయం 8గంటలకు కౌంటింగ్ ప్రారంభమైతే మొదట పోస్టల్ బ్యాలెట్లను లెక్కపెడతారు. ఆ తర్వాత రౌండ్లవారీగా ఈవిఎంలను లెక్కిస్తారు. దీని తర్వాత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నియోజకవర్గానికి ఐదు ఈవిఎం ప్యాట్‌లలో స్లిప్పులను లెక్కించే ప్రక్రియ మొదలవుతుంది. నియోజకవర్గంలోని అన్ని పోలింగ్‌బూత్‌ల నెంబర్లతో చీటీలు వేసి అందులో నుండి ఐదు స్లిప్పులను లాటరీ ద్వారా తీస్తారు. ఏ నెంబర్లు వస్తాయో ఆ నెంబర్‌ల వివి ప్యాట్‌లనే లెక్కపెడతారు. పూర్తిస్థాయిలో లెక్కపెట్టే ఈవిఎంల కంటే కూడా వివి ప్యాట్‌ల లెక్కింపే ఆలస్యం కావచ్చు. ఈవిఎంల ఓట్లకు, వివిప్యాట్ స్లిప్పులకు సరిపోయాకే ఫలితం వెల్లడిస్తారు.

ఈ నెల 7న అమరావతిలో పార్లమెంటు, అసెంబ్లీల రిటర్నింగ్ అధికారులకు కౌంటింగ్‌పై శిక్షణనివ్వనున్నారు. అలాగే జిల్లాలో కౌంటింగ్ కోసం ఎంపిక చేసిన సిబ్బందికి కూడా 10వ తేదీపైన నెల్లూరులో శిక్షణనివ్వనున్నారు.

## నెల్లూరులో...
# ఆదిశంకర జయంత్యుత్సవాలు

నెల్లూరు శ్రీ పినాకినీ విద్యాపీఠం ఆధ్వర్యంలో ఈనెల 9 నుండి 13వ తేదీ వరకు 73వ జగద్గురు శ్రీశ్రీశ్రీ ఆదిశంకరాచార్య జయంతి ఉత్సవాలను నెల్లూరు ట్రంకురోడ్డు టీవీయస్ కల్యాణ సదన్ లో నిర్వహిస్తున్నట్లు శ్రీ పినాకినీ విద్యాపీఠం అధ్యక్షులు స్వయంపాకుల శ్రీనివాసులు తెలిపారు. 9వ తేది గురువారం ఉదయం 10గంటలకు శ్రీ తిప్పరాజు వేంకట సుబ్బయ్య సత్రం వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని సంస్థ యాజమాన్యం వారి ఆధ్వర్యంలో వేదాశీర్వచనం, పండిత సత్కారం జరుగుతుందన్నారు. ప్రతిరోజు సాయంత్రం 6 గంటల నుండి ఆధ్యాత్మిక ఉపన్యాసాలు, 12 వ తేది ఆదివారం ఉదయం 10.30 గంటలకు సామూహిక లలిత కుంకుమార్చన, 13వతేది సోమవారం సాయంత్రం 5.30గంటలకు వేదపారాయణదారులకు, ఋత్వికులకు సన్మానం తదితర కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.






# "కంచి కళ"ని నెల్లూరుకి తెచ్చిన వి.ఆర్.కె. శిల్క్స్

**విపిఆర్ దంపతుల చేతుల మీదుగా శుభ ప్రారంభం**

మహిళల మనోభావాల వేదిక, వస్త్ర ప్రపంచంలో అద్భుతాల వీచిక వి.ఆర్.కె శిల్క్స్ ఇప్పుడు నెల్లూరుకొచ్చింది. ఎక్కడా, ఎప్పుడూ, ఎన్నడూ చూడని ఆకర్షణీయమైన డిజైన్లు, అందమైన రంగులు వెరసి సంపూర్ణ వస్త్రశ్రేణి హంగులను కంచి విఆర్‌కె శిల్క్స్ నెల్లూరుకు మోసుకొచ్చింది.

నెల్లూరు మాగుంట లే అవుట్, మినీబైపాస్ రోడ్డులోని బెజవాడ గోపాలరెడ్డి సర్కిల్‌లో అధునాతనంగా నిర్మించిన అపురూపమైన భవనంలో రెండంతస్తులలో "కంచి విఆర్‌కె శిల్క్స్" గురువారం ఉదయం ప్రారంభమైంది. రాజ్యసభ సభ్యులు శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో పాటు ఆయన సతీమణి శ్రీమతి ప్రశాంతి రెడ్డి కలిసి ఈ వస్త్ర సముదాయాన్ని తమ సువర్ణహస్తాలతో ప్రారంభించారు.

రత్నం విద్యాసంస్థల వ్యవస్థాపక ఛైర్మెన్ శ్రీ కె.వి.రత్నం గారు ఆయన సహధర్మచారిణి శ్రీమతి పద్మావతితో



విఆర్‌కె శిల్క్స్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు

కలిసి జ్యోతి ప్రజ్వలనం గావించారు. సింహపురి హాస్పిటల్స్ ఛైర్మెన్ కాటంరెడ్డి రవీంద్రరెడ్డి, తన శ్రీమతి ప్రసూనతో కలసి తొలి అంతస్తును ఆవిష్కరించారు.

వేల రకాల డిజైన్లతో అందరికీ అందుబాటు ధరలతో 1500 రూపాయల నుండి రెండు లక్షల రూపాయల వరకు మహిళలు మెచ్చే అన్ని రకాల వస్త్రాలను ఈ స్టోర్‌లో అందుబాటులో వుంచారు.

ఈ సందర్భంగా శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆయన సతీమణి శ్రీమతి ప్రశాంతిరెడ్డిలు మాట్లాడుతూ నెల్లూరు మహిళా ప్రపంచానికి అరుదైన కానుకగా విఆర్‌కె ఆవిర్భవించిందని, అందరికీ అందుబాటు ధరలలో అన్ని రకాల వారిని ఆకర్షించే విధంగా షోరూంను రూపొందించిన యాజమాన్యం అభినందనీయులని అన్నారు. ప్రారంభోత్సవ వేడుకలో పాల్గొని తమను ఆశీర్వదించిన ముఖ్య అతిథులకు, ఆహ్వానితులకు, మహిళా కస్టమర్లకు సంస్థ యాజమాన్యం తమ కృతజ్ఞతలు తెలిపింది. ఈ స్టోర్‌లో కాంచిపురం, బెనారస్, పైధానీ, పటాన్ పటోలా, లెనిన్, గధ్వాల్, రియల్ జరి కోట, ఉప్పాడ, ఇక్కత్, చాందిని శిల్క్, చాప శిల్క్ వెరైటీలు లభిస్తాయని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా విస్తరించి వున్న తమ సంస్థ 47వ స్టోర్‌గా నెల్లూరు షాప్‌ను ప్రారంభించామని సంస్థ ఛైర్మెన్ వి.నాగభూషణం తెలిపారు. నెల్లూరీయులు తమని ఆదరిస్తున్న తీరు చాలా ప్రోత్సాహకరంగా వుందని, మహిళామణుల ఆదరణే తమ పురోభివృద్ధికి పునాది అని అన్నారు. ఆల్ ది బెస్ట్ టు విఆర్‌కె.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న శ్రీమతి కె.వి.పద్మావతి రత్నం దంపతులు



షోరూమ్ మొదటి అంతస్తును ప్రారంభిస్తున్న కాటంరెడ్డి రవీంద్రరెడ్డి దంపతులు

# జేఈఈ మెయిన్స్‌లో విశ్వసాయి విజయకేతనం

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో విశ్వసాయి జూనియర్ కళాశాలకి చెందిన 131 మంది విద్యార్థులు జాతీయస్థాయిలో విజయకేతనం ఎగురవేశారని విశ్వసాయి విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ ఎన్.సత్యనారాయణ తెలిపారు. డి.చరిస్మా జాతీయ స్థాయిలో 221వ ర్యాంకు సాధించిందని, 33 మంది విద్యార్థులు 90 కంటే ఎక్కువ పర్సంటేజ్‌తో గొప్ప ప్రతిభను కనపరిచారన్నారు. విద్యార్థుల నిరంతరకృషి, అధ్యాపకుల పర్యవేక్షణ ఈ విజయాలకు కారణమన్నారు.

విశ్వసాయి విద్యాసంస్థల వైస్‌ఛైర్మన్ కృష్ణమోహన్ మాట్లాడుతూ తాము రూపొందించి అవలంభిస్తున్న స్టై ఫ్రీ ఎడ్యుకేషన్, 5స్టెప్ ప్రోగ్రామ్ ద్వారా యంపిసిలో కూడా మంచి ఫలితాలను సాధిస్తున్నామన్నారు. ఈ ఫలితాల స్ఫూర్తితో ప్రత్యే




ర్యాంకర్లతో విశ్వసాయి విద్యా సంస్థల అధినేతలు డాక్టర్ ఎన్.సత్యనారాయణ, కృష్ణమోహన్

కంగా రూపొందించిన విశ్వసాయి ఐఐటి అకాడమీకి విద్యార్థుల నుంచి మంచి స్పందన ఉందన్నారు. విజయాలు సాధించిన విద్యార్థులను పుష్పగుచ్ఛాలతో అభినందించారు. జాతీయ స్థాయిలో విశేష ప్రతిభ కనపరచిన విద్యార్థులను, వారిని ప్రోత్సహించిన అధ్యాపక, అధ్యాపకేతర బృందాన్ని కళాశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించారు. ఈ విజయపరంపర భవిష్యత్తులో అన్ని పోటీ పరీక్షల్లో కూడా కొనసాగుతుందని తెలిపారు. విశ్వసాయి జూనియర్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## 'ప్రభా'తం

ఉగ్రవాదం.. అనేది కాటువేసేందుకు పొంచి ఉన్న విషసర్పం. ఇది ఎప్పుడూ అదనుకోసం వేచి చూస్తూ ఉంటుంది. జనమంతా ఏ పండుగ సంబరాల్లోనో, ఆనందోత్సవాల్లోనో ఆదమరచి ఉన్నప్పుడు వికృతహాసం చేస్తూ విరుచుకుపడి ప్రజల్ని పొట్టనబెట్టుకునే కిరాతకత్వానికి నిలువెత్తురూపమే.. ఉగ్రవాదం.

మొన్నటికి మొన్న శ్రీలంకలో ఉగ్రవాద రాక్షసి ఎలా తన పైశాచికత్వంతో తెగబడి బాంబుపేలుళ్లతో ఆత్మాహుతి దాడులకు పాల్పడి 321 మందికిపైగానే అమాయక ప్రజల్ని చంపి తన రక్తదాహం తీర్చుకుంది. ముప్పు మనకు ఉండదులే..అని నిర్లిప్తంగా ఉంటే ఎంతటి దుష్ఫలితాల్ని అనుభవించాల్సి వస్తుందో శ్రీలంక ఒక తాజా ఉదాహరణ. అసలే దాదాపు 30 ఏళ్ళుగా అంతర్యుద్ధంతో నలుగుతూ అతలాకుతలమై ఉన్న ఆ దేశంలో...ఇటీవల ప్రజలపై జరిగిన ఉగ్రవాదుల కిరాతక దాడులు ప్రపంచాన్నే కంటతడి పెట్టించాయి. ఐసిస్ ఉగ్రవాద తాండాల ధాటికి తట్టుకోలేక శ్రీలంక విలవిలలాడుతోంది. అయితే, శ్రీలంకలో పేలుళ్ళు.. ఒక్క శ్రీలంకనే కాదు, యావత్ ప్రపంచాన్నే గడగడ లాడిస్తున్నాయి. ఉగ్రవాదులు ఎప్పుడు ఎలాంటి విధ్వంసానికి తెగబడతారోనని ప్రపంచదేశాలు భయంతో కంపించిపోతున్నాయి. ఇలాంటి దారుణ మారణహోమాలతో ఉగ్రవాదులు కదం తొక్కుతున్న వేళ.. ప్రపంచమంతా అప్రమత్తంగా ఉండాలే తప్ప ఎక్కడా నిర్లిప్తంగా ఉండ కూడదు. ఏ మాత్రం ఆదమరచినా.. అంతే!..

ఉగ్ర రక్కసిమూక ఎప్పుడు ఏ దేశంలో ఎలాంటి రాక్షసత్వానికి ఒడిగడుతుందో తెలియదు. ఐసిస్ అనే ఆ భయంకర ఉగ్రవాదసంస్థను నేలమట్టం చేసేశామంటూ ఇటీవల కొన్ని దేశాలు ధీమాగా ప్రకటించుకున్న నేపథ్యంలో, ఇటీవల శ్రీలంకలో జరిగిన ఉగ్ర పేలుళ్ళు ఆ దేశాలను ఉలిక్కిపడేలా చేశాయి. తన వికృతదాడులతో ప్రపంచాన్నే భయోత్పాతానికి గురిచేస్తున్న ఐసిస్‌ను నేలమట్టం చేయాలని అమెరికా, రష్యా వంటి అగ్రదేశాలు సైతం ఎన్నో ప్రయత్నాలు చేసి.. కొంతమేరకు ఆ ఉగ్రవాదోన్మాదులను కట్టడిచేశాయి కూడా. దీంతో ఇక తమ దేశాలకు ముప్పు తప్పినట్లేనని ఆ దేశాలు భావిస్తున్న తరుణంలో..మళ్ళీ ఒక్కసారిగా లేచిన ఉగ్రవాద రక్కసి కొలంబోలో కోరలుసాచి అనేకమంది ప్రజలను కాటేసింది. అసలు తమ దేశానికి ఎలాంటి ఉగ్రవాదం ముప్పు ఉండదని ధీమాగా ఉన్న శ్రీలంకలో నేషనల్ తౌహీద్ ఇబ్రహీం (ఎన్‌టిజె), జమ్మియాతుల్ మిల్లత్తు ఇబ్రహీం (జెఎంఐ) అనే ఉగ్రసంస్థలు ఇటీవలికాలంలో పుట్టుకొచ్చాయి. బాంబుపేలుళ్ళు జరిగిన తర్వాత చేసిన దర్యాప్తులో శ్రీలంకలో ఉన్న ఇస్లామిక్ అతివాదులు ఈ దాడులు చేసి ఉంటారని, అతివాద ముఠాగా పేరుమోసిన నేషనల్ తౌహీత్ జమాత్ (ఎన్‌టిజె) అనే ఉగ్రసంస్థ పైనే తమకు అనుమానాలున్నాయని శ్రీలంక ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే సరిగ్గా, ఈ ఎన్‌టిజె అనే ఉగ్రవాద సంస్థ శ్రీలంకలో భారీ విధ్వంసానికి పాల్పడే అవకాశం ఉందని అనుమానిస్తూ పేలుళ్ళకు కొద్దిరోజుల కిందటనే శ్రీలంకను భారత్ నిఘావర్గాలు హెచ్చరించాయి కూడా. అయితే, తమకు ఏ ఉగ్రవాద ముప్పు ఉండదనే నిర్లిప్త ధోరణితో శ్రీలంక భారత్ హెచ్చరికలను పట్టించుకోలేదు. ఫలితంగా శ్రీలంక ఉగ్రవాదుల అత్యంత కిరాతక విధ్వంసాన్ని చవిచూడాల్సింది. అంతేకాదు, నేషనల్ తౌహీత్ జమాత్ (ఎన్‌టిజె) అనే ఉగ్రవాదసంస్థకు తమిళనాడులోని తైహీద్ జమా సంస్థతో కూడా సంబంధాలు ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతుండడం భారత్‌కు ఎంతో ఆందోళన కలిగించే విషయం. అందువల్ల భారత్ మరింతగా అప్రమత్తంగా ఉండాలి. ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తున్న ఐసిస్ ఉగ్రవాద విషసర్పపు భావజాలం ప్రభావం తమ దేశంలో కూడా పడుతుందని శ్రీలంక ఊహించలేకపోయింది. ఎల్‌టిటిఇ పీడ విరగడైందన్న ఆనందంలో ఉన్న శ్రీలంక, ఇక అలాంటి ముప్పు తమకేమీ ఉండదని ఏమారిపోయింది. అంతే..అదే అదనుగా ఐసిస్ రాకాసి విరుచుకుపడింది. తన నిర్లిప్తధోరణికి శ్రీలంక భారీమూల్యం చెల్లించాల్సివచ్చింది.. ఉగ్రవాద రక్కసి అన్ని దేశాలను, సకల మానవాళిని ఎంతోకాలంగా భయపెడుతూనే ఉంది. 2011లో అమెరికాను కూడా ఉగ్రవాదులతో గడగడలాడించింది. అయితే, ఆ తర్వాత అమెరికా కనీవినీ ఎరుగనిరీతిలో భద్రతను కట్టుదిట్టం చేసుకుని ఇక అలాంటి ఘటనలకు తావు లేని విధంగా భద్రతా ఏర్పాట్లు చేసుకుంది. అదేవిధంగా ఐరోపా దేశాలు, బెల్జియం, ఫ్రాన్స్, జర్మనీ వంటి దేశాలు కూడా ఉగ్రవాద ముప్పును గ్రహించి అంతర్గత భద్రతా వ్యవస్థను ఎంతో పటిష్టం చేసు కున్నాయి. అయితే, ఇతరదేశాలకన్నా భారత్‌కు ఐసిస్ ఉగ్రవాద భావజాలం వల్ల ముప్పు ఎక్కువగా ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఉగ్రవాద బాధిత దేశాల్లో మనం ముందు వరుసలోనే ఉన్నాం. కనుక అందరికన్నా అప్రమత్తంగా ఉండాల్సింది మనమే. అసలే ఉగ్రవాదానికి పుట్టినిల్లుగా ఉన్న పాక్ ఎప్పటి కప్పుడు ఉగ్రరాకాసులను భారత్‌పైకి ఉసిగొల్పుతుండడం అందరికీ తెలిసిందే. పాక్ ప్రేరేపిత ఉగ్రసంస్థలు మనదేశంలో విధ్వంసకాండలు సృష్టించ చేందుకు ఎల్లప్పుడూ పొంచి ఉంటున్నాయి. పఠాన్‌కోట, యూరీ, పుల్వామా ఘటనలు అందుకు ప్రత్యక్షసాక్ష్యం. ఇలాంటి గుణపాఠాలతో ఇప్పుడు మనదేశం గతంలో కంటే భద్రత విషయంలో ఎంతో పకడ్బందీగానే ఉంది. నిఘావ్యవస్థ కూడా మరింత పటిష్టమైంది. అయినా..ఇంకా మరింతగా..మనదేశం అప్రమత్తంగా ఉండాలి. ఒక్క క్షణం కూడా ఏమారకుండా.. నిఘాకన్నులు కంటికి రెప్పవేయకుండా కాపు కాయాలి. దేశభద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి.

మనకేమీ జరగదులే.. అని ఎవరికి వారు.. ఏ దేశానికాదేశం ఉగ్రవాదుల పట్ల నిర్లిప్తంగా ఉంటే ఏమవుతుందో.. శ్రీలంక ఘటనలు ప్రపంచ దేశాలన్నిటికీ ఒక గుణపాఠం. ఉగ్రవాదసంస్థలను, ఉగ్రవాదోన్మాదులను, మొత్తంగా ఉగ్రవాద భావజాలాన్ని ..ఉగ్రవాద విషవృక్షాన్ని సమూలంగా నేలమట్టం చేస్తే తప్ప ప్రపంచానికి పట్టిన పీడ వదలదు. అందుకు ప్రపంచంలోని అన్నిదేశాలు వెంటనే కలసికట్టుగా.. సంసిద్ధం కావాలి. అందుకు సరైన తరుణం ఇదే!...

### మనమూ జాగ్రత్తపడాలి!

మనకేమీ జరగదులే..అని ఎవరికి వారు ఉగ్రవాదుల పట్ల నిర్లిప్తంగా ఉంటే ఏమవుతుందో..శ్రీలంక ఘటనలు ప్రపంచానికే ఒక గుణపాఠం. ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాద ముప్పు ఎలా పొంచివుందో.. శ్రీలంక ఘటనలే ఒక ఉదాహరణ. అందుకే, అన్నిదేశాలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలి. ఉగ్రవాదసంస్థలను, ఉగ్రవాదోన్మాదులను, మొత్తంగా ఉగ్రవాద విష వృక్షాన్ని సమూలంగా నేలమట్టం చేస్తే తప్ప ప్రపంచానికి పట్టిన పీడ వదలదు. అందుకు ప్రపంచదేశాలన్నీ సంసిద్ధం కావాల్సిన తరుణం ఇదే!...

---

### నర్రవాడ వెంగమాంబాదేవికి
## 12 లక్షల హుండీ ఆదాయం

జిల్లాలో ప్రసిద్ధిచెందిన నర్రవాడ వెంగమాంబాదేవి పేరంటాలు అమ్మవారి దేవస్థానం హుండీలను గతనెల 29న దేవాదాయశాఖ అధికారులు లెక్కించి 4నెలల కాలానికి అమ్మవారి ఆలయానికి మొత్తం 12,00,798 రూపాయల ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ లెక్కింపులో ఇ.ఓ ఆర్.వెంకటేశ్వర్లు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తల మండలి చైర్మన్ పచ్చవ కరుణాకర్‌బాబు, మాజీ సర్పంచ్ మేకపాటి మాలకొండరాయుడు, దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రమణ, మండల బిజెపి ప్రధాన కార్యదర్శి మేకపాటి మాల్యాద్రి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

### పద్య సారస్వత పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో
## 7 నుంచి 24వరకు మహాభారతోపన్యాసాలు

పద్య సారస్వత పరిషత్ నెల్లూరుజిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 7 నుంచి 24వ తేది వరకు ప్రతి రోజు సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు 18 రోజుల పాటు మహాభారతోపన్యాసాలు నిర్వహిస్తామని ఆ సంస్థ అధ్యక్షులు పోలవరపు లక్ష్మీనరసింహారావు, ప్రధాన కార్యదర్శి డా. చీమకుర్తి వేంకటేశ్వరరావు, కోశాధికారి సూరం చంద్రశేఖరంలు తెలియజేశారు. నెల్లూరు బాలాజీనగర్‌లోని శ్రీ సీతారామ స్వామి మందిరంలో జరిగే ఈ ఆధ్యాత్మిక ఉపన్యాసాలను ఇనమడుగులోని శ్రీ సత్యానందాశ్రమ పీఠాధిపతులు శ్రీ శ్రీహరితీర్థ స్వామి వారి ఆశీస్సులతో నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఉపన్యాసాల్లో భాగంగా తొలిరోజు 7వ తేదిన డా. సూరం శ్రీనివాసులు 'ఆదిపర్వం' మొదటిభాగాన్ని వివరిస్తారని, అదేవిధంగా 8వ తేదిన విద్వాన్ ఆలూరు శిరోమణిశర్మ ఆదిపర్వం రెండవ భాగం, 9న పోలవరపు లక్ష్మీనరసింహారావు 'సభాపర్వం', 10న అవధాని కోట రాజశేఖర్ 'అరణ్యపర్వం', 11న 'పద్యభారతి' చదలవాడ లక్ష్మీనరసింహారావు 'అరణ్యపర్వం', 12న డా. చీమకుర్తి వేంకటేశ్వరరావు 'విరాటపర్వం', 13న విద్వాన్ అగస్త్యరాజు సుబ్బారావు 'ఉద్యోగ పర్వం', 14న డా. కె.గిరిజాలక్ష్మి 'భీష్మ పర్వం', 15న డా. సూరం శ్రీనివాసులు 'ద్రోణ పర్వం', 16న శతావధాని కొండెపి మురళీకృష్ణ 'కర్ణపర్వం', 17న దర్భ బాలసుబ్రహ్మణ్యం 'శల్యపర్వం', 18న విద్వాన్ మాచవోలు శివరాంప్రసాద్ 'సౌప్తిక, స్త్రీ పర్వాలు', 19న డా.ఐనవోలు శ్రీనివాస చక్రపాణి 'శాంతిపర్వం', 20న డా.కె.సత్యనారాయణ 'శాంతిపర్వం', 21న డా. సింగరాజు ప్రసాదరావు 'అనుశాసనపర్వం', 22న బత్తెన సాయికుమార్ రెడ్డి 'అశ్వమేధపర్వం', 23న డా.చీమకుర్తి వేంకటేశ్వరరావు 'ఆశ్రమవాస, మౌసల పర్వాలు', 24న చెకుముకి భాస్కరరావు 'మహాప్రస్థానిక, స్వర్గారోహణ పర్వాలు' వివరిస్తారన్నారు. భక్తులు, సాహిత్యాభిమానులు ఈ కార్యక్రమాలకు విచ్చేసి జయప్రదం చేయాలని వారు కోరారు.

---

### ప్రాణంతో చెలగాటం

తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డ్ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడింది. తమ వైఫల్యాలకు 18మంది విద్యార్థుల జీవితాలను బలి తీసుకోవడం విచారకరం. గ్లోబరినా అనే సాఫ్ట్‌వేర్ కంపెనీ వారి సాంకేతిక వైఫల్యానికి విద్యార్థులు మూల్యం చెల్లించు కోవాల్సి వచ్చింది. ఇలాంటి దారుణ సంఘటనలకు విద్యాశాఖ మంత్రి నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలి. కాని, ఇప్పటి మంత్రుల్లో ఆ విలువలే పోయాయి. ఎంతటి ఘోరాలు జరిగినా దెయ్యాల్లాగా పదవులను వదలడం లేదు. బంగారు తెలంగాణ తెస్తానన్న కేసీఆర్ తమ నిర్వాకంతో 18మంది విద్యార్థుల తల్లిదండ్రులకు కడుపు కోత మిగిల్చాడు.

ద్వారపూడి అన్నపూర్ణ, హైదరాబాద్.

### ఉగ్రవాదానికి రూపం ఒక్కటే!

ఉగ్రవాదానికి ఒక దేశం, ఒక ప్రాంతం, ఒక మతం, ఒక కులం వుండదు. అమెరికాలో నాగుపామైనా, ఆస్ట్రేలియాలో నాగుపామైనా ఇండియాలో నాగుపామైనా కాటేయడమే వాటి లక్ష్యం. ఉగ్రవాదం కూడా అంతే. వారికి ఆ దేశం, ఈ దేశం అని లేదు. ఏ దేశంలోనైనా మారణహోమాలు సృష్టించడమే వారి లక్ష్యం. శ్రీలంకలో జరిగిన బాంబు పేలుళ్ళు ఇంకా ఉగ్రవాద సర్పాలకు నీడనిస్తున్న చైనా వంటి దేశాలకు గుణపాఠం కావాలి. మొన్న ఇండియాలో, నిన్న యూరప్ దేశాలలో జరిగిన మారణహోమాలు ఈరోజు శ్రీలంకలో జరుగుతున్నాయి. రేపు చైనాలో కూడా జరగవచ్చు. కాబట్టి ఇండియా మీద వున్న గుడ్డి వ్యతిరేకతతో చైనా ఉగ్రవాదులకు మద్దతు పలుకకుండా, ఉగ్రవాద ముప్పును ముందుచూపుతో గ్రహించి దీనిని అంతం చేయడానికి మిగిలిన దేశాలతో కలిసి కృషి చేయాలి.

– పల్లవోలు సతీష్, నెల్లూరు.

### తప్పు చేయకుంటే భయమెందుకు?

ఈ అయిదేళ్ళలో ఎన్ని తప్పులు చేశాడోగాని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సీఎస్ సమీక్షలకే భయపడిపోతున్నాడు. ఎన్నికల ఫలితాలు వచ్చేదాకా హుందాగా వ్యవహరించాల్సిందిపోయి తన స్థానాన్ని దిగజార్చుకునేలా ప్రవర్తిస్తున్నాడు. ఆయన భయం, ఆయన తపన చూస్తుంటే ఈ 20రోజులు సీఎం సీట్లో కూర్చుని ఈ ఐదేళ్లలో చేసిన అవినీతి అక్రమాల సాక్ష్యాలను అధికారుల చేతికి చిక్కకుండా చేయాలనుకుంటున్నట్లుగా వుంది. సీఎస్ ఎల్.వి.సుబ్రహ్మణ్యం కూడా ఆయనకు జ్వరం కాసేలా సమీక్షలు జరుపుతూ ఐదేళ్లలో జరిగిన ఆర్థిక వ్యవహారాలపై లోతుగా వెళుతున్నాడు. ఎల్‌వి సుబ్రహ్మణ్యం కఠిన పనితీరు చూసే చంద్రబాబుకు ముచ్చెమటలు పడుతున్నాయంటున్నారు.

పి.రమణ, నెల్లూరు.



# పంచమ వర్ధంతి



జననం
09.09.1964

మరణం
06.05.2014

మా ఇంటి ఆశాదీపం

## జక్కా రామ్‌మోహన్‌రెడ్డి

పరమపదించి తే. 6.5.2019ది నాటికి ఐదు సంవత్సరాలు గడుస్తాయి.

వారి దివ్యస్మృతిలో...

నానమ్మ : జక్కా కామేశ్వరమ్మ

నాన్న : జక్కా కోదండరామిరెడ్డి
మాజీ శాసనసభ్యులు

అమ్మ : జక్కా సులోచనమ్మ

భార్య : జక్కా వినుజరెడ్డి

కుమార్తె : జక్కా రిధిరెడ్డి

కుమారుడు : జక్కా మనవ్‌రెడ్డి

తమ్ముడు : జక్కా జనార్ధన్‌రెడ్డి

మరదలు : జక్కా స్మితరెడ్డి

తమ్ముని కుమారుడు : జక్కా కోదండ శ్రీవత్స

చెల్లెలు : పద్మజ

బావ : ఎ.బి.వి.రమణారెడ్డి

చెల్లెలి కుమార్తెలు : ప్రియదర్శిని వెంకట్, యామిని వెంకట్

# రోడ్డు ప్రమాదాలను నివారించండి

**- జిల్లా కలెక్టర్ ఆర్. ముత్యాలరాజు**



అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు

జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. గతనెల 29న కలెక్టర్ తన ఛాంబర్‌లో రహదారి భద్రతా కమిటీ సమావేశంలో మాట్లాడుతూ, గత సంవత్సరం మార్చి వరకు 343 రోడ్డు ప్రమాదాలు జరిగి, 127 మంది మృతి చెందారని, మరో 347 మందికి గాయాలయ్యాయని తెలిపారు. అదేవిధంగా, ఈ ఏడాది మార్చి వరకు 319 ప్రమాదాలు జరగ్గా 136 మంది మరణించారని, మరో 399 మంది గాయాలకు గురయ్యారని పేర్కొన్నారు. ఎక్కువగా ద్విచక్రవాహన ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. జాతీయ రహదారులపై ప్రమాదాలు జరిగితే వెంటనే 108 అత్యవసర వాహనాల వారు ప్రథమచికిత్స చేసి బాధితులను ఆసుపత్రులకు తరలించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగి, డిటిసి శివరాంప్రసాద్, ఆర్టీసి ఆర్ఎం రవివర్మ, మునిసిపల్ కమిషనర్ ఆలీంబాషా తదితరులు పాల్గొన్నారు.

# హోటళ్ళ గదులకు భలే డిమాండ్

మే23వ తేదీ నెల్లూరులో 14 అసెంబ్లీ నియోజకవర్గాలు, 2పార్లమెంట్ స్థానాలకు కౌంటింగ్ నిర్వహించనుండడం తెలిసిందే. డికెడబ్ల్యు కాలేజీలో నెల్లూరు లోక్‌సభతో పాటు నెల్లూరు సిటి, నెల్లూరురూరల్, కోవూరు, ఉదయగిరి, కావలి, కందుకూరు, ఆత్మకూరు అసెంబ్లీ స్థానాల కౌంటింగ్, అలాగే కనుపర్తిపాడులోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో తిరుపతి పార్లమెంట్‌తో పాటు తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు, వెంకటగిరి, సూళ్ళూరుపేట, గూడూరు, సర్వేపల్లి అసెంబ్లీ స్థానాల కౌంటింగ్ జరుగనుంది. ఫలితాలను దగ్గరుండి తెలుసుకునేందుకు ఆయా పార్టీల అభ్యర్థులకు తోడుగా అనుచరులు, కార్యకర్తలు పెద్దఎత్తున ఆరోజు నెల్లూరులో వుండడానికి ప్లాన్ చేసుకుంటున్నారు. ఇందుకోసం నగరంలోని హోటళ్లలో గదులు బుక్ చేసుకుంటున్నారు. 23వ తేదీ ఫలితాల దెబ్బకు హోటళ్ళలో రూమ్‌లకు బాగా డిమాండ్ ఏర్పడింది.

# భగ్గుమంటున్న ధరలు



ఎండల దెబ్బకు కూరగాయల దిగుబడి తగ్గిపోయింది. దీంతో మార్కెట్‌లో కూరగాయల రేట్లు మండిపోతున్నాయి. టమోటా మళ్ళీ 'టయోటా' కారులా కాలరెగరేసింది. కిలో 40 నుండి 50 రూపాయలు పలుకుతోంది. ఈ టమోటాలనే అప్పుడప్పుడూ కిలో రూపాయికి కూడా కొనేవాళ్ళు లేక పాపం రైతులు రోడ్లమీద పడేసిపోవడం చూస్తుంటాం. అలాంటి రోజులతో పాటు కిలో 50రూపాయలు పలికే రోజులను కూడా ఏడాదిలో అప్పుడప్పుడూ చూస్తుంటాం.

ఇప్పుడు మార్కెట్‌లో టమోటాకు మంచిరోజులొచ్చాయి. ఒక్క టమోటా ఏమిటి అన్ని కూరగాయల ధరలు మండిపోతున్నాయి. కూరగాయల ధరలు అదిరి పోతున్నాయని నాన్‌వెజ్ జోలికి పోదామా అంటే కిలో స్కిన్‌లెస్ చికెన్ 250 రూపాయలు దాటింది.


# ఆర్టీసీలో స్లీపర్ బస్సులు



స్లీపర్ బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఆర్టీసీ ఇడి వెంకటేశ్వరరావు

నెల్లూరు ఆర్టీసీలో ఇంతవరకు వోల్వో, ఇంద్ర ఏ.సి బస్సులే వుండేవి. ప్రైవేట్ ట్రావెల్స్ ఎక్కువుగా స్లీపర్ బస్సులు నడుపుతున్నాయి. బెంగుళూరు, హైదరాబాద్, వైజాగ్ వైపు వెళ్ళే ప్రయాణీకులు స్లీపర్ బెర్త్‌ల కోసం ఎక్కువుగా ప్రైవేట్ ట్రావెల్స్‌నే ఆశ్రయిస్తున్నారు. రాత్రివేళ ప్రయాణం స్లీపర్ బస్సుల్లో అయితే కొంత సుఖవంతంగా ఉంటుంది. అయితే తాజాగా నెల్లూరు ఆర్టీసీ కూడా స్లీపర్ బస్సులను ప్రవేశపెట్టింది. హైదరాబాద్‌కు రెండు వెన్నెల స్లీపర్ సర్వీసులను, అలాగే వైజాగ్‌కు రెండు ఇంద్ర ఏసి సర్వీసులను ప్రారంభించింది. 28వ తేదీన ఆర్టీసీ ఈడి జి.వేంకటేశ్వరరావు ఆర్టీసీ ప్రాంగణంలో పచ్చజెండా ఊపి ఈ సర్వీసులను ప్రారంభించారు. నెల్లూరు నుండి హైదరాబాద్‌కు బయలుద్దేరే వెన్నెల స్లీపర్ బస్సుల్లో 30 బెర్త్‌లుంటాయి. రాత్రి 9గంటలకు ఈ బస్సు నెల్లూరు నుండి బయలుదేరి తెల్లారి 6గంటలకు హైదరాబాద్‌లోని బిహెచ్ఇఎల్‌కు చేరుకుంటుంది. అలాగే ప్రతిరోజూ రాత్రి 7గంటలకు హైదరాబాద్‌లో బయల్దేరి తెల్లారి 4గంటలకు నెల్లూరుకు, 7.30 గంటలకు చెన్నైకి చేరుకుంటుంది. నెల్లూరు నుండి హైదరాబాద్‌కు 1230 రూపాయలుగా, హైదరాబాద్ నుండి చెన్నైకు 1900 రూపాయలుగా ఛార్జీలు నిర్ణయించారు. అలాగే ఇంద్ర బస్సు నెల్లూరులో రాత్రి 7గంట లకు బయలుదేరి తెల్లారి ఉదయం 8.25 గంటలకు విశాఖ చేరుతుంది. అక్కడ రాత్రి 8గంటలకు బయల్దేరే బస్సు పక్కరోజు ఉదయం 9.40గంటలకు నెల్లూరుకు చేరుతుంది. ఇందులో 1100 రూపాయలు ఛార్జీగా నిర్ణయించారు.

## నెల్లూరు కబుర్లు



### తుఫాన్‌లు కూడా
# కరుణించలేదు

తుఫాన్‌లంటే భయపడే రోజులు పోయి అవి వస్తున్నాయంటే జనం పండుగ చేసుకునే రోజులు వచ్చాయి. ఎందుకంటే కనీసం తుఫాన్‌లతోనన్నా వర్షాలు పడతాయనే ఓ చిన్న ఆశ. నెల్లూరుజిల్లాలో సాధారణ వర్షాలు కురవడం లేదు. మూడేళ్ళుగా వరుసగా కరవు కాటకాలే. సముద్రంలో అల్పపీడనాలు ఏర్పడ్డాయంటే అంతులేని ఆనందం. ఆ పరంపరలోనే ఈ మండు వేసవిలో బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని, అది తీవ్ర తుఫాన్‌గా రూపందాల్చి తీరం దాటొచ్చని తమిళనాడు, దక్షిణాంధ్రలో భారీ వర్షాలు కురవొచ్చని వాతావరణ శాఖ తెలిపేసరికి నెల్లూరు జనానికి చెప్పలేనంత సంతోషమేసింది. తీరాచూస్తే ఫొని తుఫాన్ కూడా నెల్లూరుజిల్లాని కరుణించకుండా అసలు రాష్ట్ర తీరాన్నే దాటి వెళ్ళిపోయింది.

# క్యాన్సర్ ఆసుపత్రికి విరాళం




జె.యస్.రెడ్డి చేతులమీదుగా విరాళాన్నందజేస్తున్న నారాయణ

నెల్లూరులోని రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రికి విశ్రాంత ఐటిఐ డిప్యూటీ ట్రైనింగ్ ఆఫీసర్ సిహెచ్ నారాయణ 2లక్షల 50వేల రూపాయలను విరాళంగా అందజేశారు. ఏప్రిల్ 25వ తేదీన క్యాన్సర్ ఆసుపత్రి స్థాపక దాత జె.యస్.రెడ్డి చేతుల మీదుగా ఆయన ఈ విరాళం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఏ.వి.సుబ్రహ్మణ్యం, ఆసుపత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వి.లక్ష్మీ, నారాయణ కుమారుడు సిహెచ్ అజయ్ బాబులు పాల్గొన్నారు.

### మండుటెండల్లో చల్లని నీళ్ళిచ్చే..
# 'నుడా' చలివేంద్రం

ఈ మండుటెండల్లో నెల్లూరు నగరంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు 'నుడా' ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటుచేశారు. నుడా కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని గతనెల 26న నుడా వీసీ అరుణ్‌బాబు ప్రారంభించారు. నుడా కార్యాలయానికి వచ్చే ప్రజలకు అందుబాటులో ఉండేలా ఈ నీటి సదుపాయం ఏర్పాటుచేశామని ఆయన అన్నారు. నుడా సెక్రటరీ పార్థసారధి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటరామిరెడ్డి, ప్లానింగ్ అధికారి కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఎఫ్ఐ కొత్త నాయకులు

సిపిఎం అనుబంధ విద్యార్థి సంఘమైన ఎస్ఎఫ్ఐ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం నెల్లూరులోని సిపిఎం జిల్లా కార్యాలయంలో జరిగింది. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడిగా వి.సనత్‌ను, కార్యదర్శిగా పి.శ్రీనివాసులును ఎన్నుకున్నారు.

### దివ్యాంగుల మధ్య
# అజీజ్ కొడుకు బర్త్‌డే!



ఏప్రిల్ 28వ తేదీన నెల్లూరు మేయర్ షేక్ అబ్దుల్ అజీజ్ తన కొడుకు అబ్దుల్ హక్ జన్మదినోత్సవ వేడుకలను నెల్లూరు అయ్యప్పగుడి సెంటర్‌లోని ప్రగతి ఛారిటీస్‌లో దివ్యాంగుల మధ్య నిర్వహించి ఆదర్శ ప్రాయంగా నిలిచాడు. దివ్యాంగులైన చిన్నారుల చెంత హక్ చేత కేక్ కట్ చేయించి అందరికీ తినిపించాడు. దివ్యాంగులకు స్వీట్లు పంచారు. ఈ వేడుకలలో అజీజ్ సతీమణి షర్మిల, స్థానిక తెలుగుదేశం నాయకులు కూడా పాల్గొన్నారు.

### నెల్లూరు వర్ధమాన సమాజం
# కార్యవర్గం ఎంపిక



నెల్లూరు టౌన్‌హాల్ ప్రాంగణంలో వున్న శ్రీ నెల్లూరు వర్ధమాన సమాజానికి గత నెల 29న కార్యవర్గం ఎంపికైంది. అధ్యక్షులుగా బత్తినపట్ల శేషారెడ్డి, కార్యదర్శిగా మజ్జిగ ప్రభాకరరెడ్డి, ఉపాధ్యక్షులుగా వేదం వెంకట్రామన్, పొన్నాల రామసుబ్బారెడ్డి, డాక్టర్ ఎ.నాగరత్నం, బత్తిన సాయికుమార్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా బిరుదవోలు రామిరెడ్డి, గౌరవ గ్రంథాలయాధికారిగా కొండా వెంకటస్వామి, కార్యవర్గసభ్యులుగా మోపూరు వేణుగోపాలయ్య, డాక్టర్ ఉడాలి నరశింహాశాస్త్రి, కరిమద్దెల నారశింహారెడ్డి, గానుగపెంట నారాయణ రెడ్డి, పెమ్మారెడ్డి బాబురెడ్డి, కనుమూరు రఘునాథ రెడ్డి, డి.దమరేశ్వర్, డాక్టర్ యం.సుబ్రహ్మణ్యం, డాక్టర్ టి.వసంతకుమార్‌లు ఎంపికయ్యారు.

### అయ్యప్పస్వామి దేవస్థానంలో
# 18 మెట్ల నిర్మాణం



మెట్లకు పూజ చేస్తున్న పండితులు

నెల్లూరు వేదాయపాళెంలో ఉన్న శ్రీ అయ్యప్పస్వామి దేవస్థానంలో భక్తుల కోరిక మేరకు దాతల సహకారంతో అలయ స్థపతి కేరళ వాస్తవ్యులు కాణిప్పయ్యర్ కృష్ణన్ నంబూద్రి సూచనల మేరకు పాత మెట్లు తొలగించి నూతనంగా నిర్మించనున్న 18 మెట్లుకు గతనెల 29న పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం తంత్రి విపిడి హరి నంబూద్రి చేతుల మీదుగా విశేష పూజలు నిర్వహించారు. స్వామి అయ్యప్ప సేవా సమాజం అధ్యక్షుడు పిటి రంగరాజన్, కార్యదర్శి శేషగిరిరావు, మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధర కృష్ణారెడ్డి, రమణయ్య, శ్రీకాంత్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి, నరశింహారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.



**ఒక జంటకు ఏప్రిల్ 11వ తేదీన పెళ్లి చేశారు. మే 23వ తేదీన వారికి శోభన ముహూర్తం పెట్టారనుకోండి... పరిస్థితి ఎలా వుంటుంది. ఇప్పుడు ఎలక్షన్‌లలో పోటీ చేసిన అభ్యర్థులు, రాజకీయ నాయకులు, కార్యకర్తల పరిస్థితి కూడా అలాగే వుంది.**

# ఒక్కొక్కరిది.. ఒక్కో టెన్షన్!

## ఫలితాల కోసం నిరీక్షణ

మే23వ తేదీ ఎన్నికల ఫలితాల కోసం జిల్లా వ్యాప్తంగా నాయకులు, కార్యకర్తలు, వివిధ వర్గాల వారు ఎంతో ఆత్రతగా ఎదురు చూస్తున్నారు. మామూలు పరిస్థితుల్లో అయితే కాలం చాలా వేగంగా కదులుతున్నట్లుంటుంది. ఈ సంవత్సరం సంక్రాంతి పండుగా అలా వెళ్లిపోయిందో లేదో మరుసటి ఏడాది సంక్రాంతి పండుగ అప్పుడే వచ్చినట్లుగా అనిపిస్తుంటుంది. కాని, ఎన్నికలు జరిగిన ఏప్రిల్ 11వ తేదీ నుండి ఎన్నికల ఫలితాలు వచ్చే మే 23వ తేదీ మధ్యగల 42రోజులు ప్రజలకు చాలా భారంగా గడుస్తున్నాయి. కేలండర్‌లలో తేదీలు చాలా ఆలస్యంగా మారుతున్నట్లుగా అనిపిస్తోంది. గడియారం ముల్లు వేగంగా తిరిగి 23వ తేదీ సర్రున వచ్చేస్తే బాగుండుననుకుంటున్నారు.

ఎన్నికల ఫలితాలపై ఒక్కొక్కరు ఒక్కో కారణంతో ఎదురుచూస్తున్నారు. ఫలితాల కోసం మొదట టెన్షన్‌గా ఎదురుచూసేది పోటీలో వున్న అభ్యర్థులు. ఎంత త్వరగా ఫలితాలు వస్తే అంత తొందరగా టెన్షన్ నుండి బయటపడొచ్చని వారి బాధ. ప్రతి రోజూ పలు రకాల ఆలోచనలతో, మానసిక ఒత్తిడితో నరకం అనుభవించలేరుగా!

అభ్యర్థుల తర్వాత ఫలితాల కోసం ఎదురుచూసే వాళ్ళు పందేలు కాసిన వాళ్ళు. లక్షలు, కోట్లలో పందేలు కాసిన వాళ్ళ పరిస్థితి, భవిష్యత్ ఏంటో తెలిసేది ఫలితాలు వస్తేనే కదా! అలాగే కాంట్రాక్టర్లది ఒకరకమైన బాధ. జిల్లాలో పలు స్కీమ్‌ల క్రింద వేలకోట్ల పనులు జరుగుతున్నాయి. ఖజానాలో డబ్బులు లేవు. బిల్లులు ఆగిపోయి వున్నాయి. చంద్రబాబు సర్కార్ ఓట్ల స్కీమ్‌ల కోసం ఖజానాను ఊడ్చేసింది. రేపు ఏ పార్టీ అధికారంలోకి వస్తుందో, తమ బిల్లుల సంగతి ఏమవుతుందోనని కాంట్రాక్టర్ల బాధ.

అలాగే ఉద్యోగులు కూడా కొత్త ప్రభుత్వం ఏదొస్తుందోననే టెన్షన్‌తో ఉన్నారు. వీళ్ళ సమస్యలు వీళ్ళకున్నాయి. ప్రభుత్వంలో ప్రధానంగా మార్పు కోరుకుంటున్నది కూడా వీళ్ళే! అలాగే రియల్టర్లు ప్రభుత్వం మారితే రియల్ రంగానికి మంచిరోజులొస్తాయని ఆశిస్తున్నారు. ఇలా అన్ని రంగాలవాళ్ళు కూడా తమ కోణాలలో ఆలోచిస్తూ ఫలితాలకై నిరీక్షిస్తున్నారు.

## 8-2పై నడుస్తున్న పందేలు

జిల్లాలో ఏ పార్టీ గెలుస్తుందనే దాని కంటే కూడా జిల్లాలో ఏ పార్టీకెన్ని సీట్లు వస్తాయనేదానిపై పందేలు ఎక్కువుగా జరుగుతున్నాయి. ఈ పరంపరలో 8–2పై ఎక్కువ పందేలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. 8–2 అంటే జిల్లాలో వైసిపికి 9సీట్లు గ్యారంటీ, పది కూడా రావచ్చుని ఆ పార్టీకి చెందినవాళ్ళు పందేలు కాస్తుంటే, తెలుగుదేశంకు కనీసం రెండు సీట్లు వస్తాయని ఆ పార్టీకి సంబంధించినవాళ్ళు పందేలు కాస్తున్నారు. అలాగే నెల్లూరు నగర నియోజకవర్గంలో కూడా వైసిపి అభ్యర్థి పి.అనిల్‌కుమార్, తెలుగుదేశం అభ్యర్థి పి.నారాయణ గెలుపోటముల మీద కూడా ఎక్కువ పందేలు నడుస్తున్నాయి.



# శ్రీసిటీ లాంటిదే మాకూ కావాలి

### కర్ణాటక రాష్ట్ర పరిశ్రమల శాఖ ఉన్నతాధికారుల బృందం పరిశీలన

కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ పరిశ్రమల శాఖకు చెందిన ఐదుగురు ఉన్నతాధికారుల బృందం సోమవారం శ్రీ సిటీలో పర్యటించింది. ఆ శాఖ కమిషనర్ గుంజన్ కృష్ణ నేతృత్వంలో విచ్చేసిన అధికారుల బృందానికి శ్రీసిటీ అధ్యక్షులు సతీష్ కామత్ స్వాగతం పలికారు. గత పదేళ్లుగా శ్రీ సిటీ సాధించిన ప్రగతి, మౌళిక వసతులు, ప్రత్యేకతలు వంటి వివిధ అంశాలపై వారికి వివరించి, వారడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం శ్రీసిటీ పారిశ్రామికవాడలో పర్యటించి, ప్రపంచ స్థాయి మౌళిక వసతులు వాటి పనితీరు నేరుగా పరిశీలించారు. పరిశ్రమల స్థాపనకు, వాటి విస్తరణకు అవసరమైన అన్ని వసతులు శ్రీసిటీలో ఉన్నాయని కొనియాడారు.

శ్రీ సిటీ స్థాపన, నిర్మాణ కాలంలో ఎదుర్కొన్న అవరోధాలు, వాటిని అధిగమించిన వైనం, పారిశ్రామిక ప్రగతి వంటి వివిధ అంశాలను అధ్యయనం చేయటమే వారి పర్యటన ముఖ్యఉద్దేశ్యం. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ పారిశ్రామిక విధానాలు ప్రతిబింబించేలా ఆ రాష్ట్రంలో ఒక బృహత్తర పారిశ్రామికవాడను ఏర్పాటు చేయడంలో భాగంగా ఈ బృందం శ్రీ సిటీని సందర్శించడం విశేషం.




నిర్యాణం 4 మే 1992

పితృదేవోభవ

సంఘసేవకులు, ప్రజాసేవకులు

స్వర్గీయ తిక్కవరపు బాబురెడ్డి గారు

27వ వర్ధంతి (04.05.19) సందర్భంగా

వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ...

కుమారుడు

డాక్టర్ టి.సుబ్బరామిరెడ్డి

రాజ్యసభ సభ్యులు, మాజీ కేంద్రమంత్రివర్యులు

# మెయిన్స్‌లో సత్తా చాటిన కృష్ణచైతన్య



ర్యాంకర్లను అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్లు కృష్ణారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డిలు

సోమవారం ప్రకటించిన ఐఐటి జెయియి(మెయిన్స్) ఫలితాలలో నెల్లూరులోని కృష్ణచైతన్య కాలేజీ విద్యార్థులు జాతీయ స్థాయి ర్యాంకులతో తమ సత్తాచాటారు. ఎన్ఐటి కళాశాలల్లో సీట్లు సాధించే ర్యాంకులతో పాటు ఐఐటి-జెయియి(అడ్వాన్స్‌డ్)కు 52మంది విద్యార్థులు ఎంపికయ్యారు. 6 మంది విద్యార్థులు 96 పర్సంటైల్‌కుపైగా, 11మంది విద్యార్థులు 90పర్సంటైల్‌కుపైగా సాధించారని, అతితక్కువ ఫీజులతో అతితక్కువ మంది విద్యార్థులతో పరీక్షలు వ్రాస్తే వారిలో 52మంది విద్యార్థులు జెయియి(అడ్వాన్స్‌డ్)కు ఎంపిక కావడం అద్భుత విజయమని కృష్ణచైతన్య కళాశాల డైరెక్టర్లు డాక్టర్ ఆర్.వి.కృష్ణారెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డిలు పేర్కొన్నారు. ఈ ఏడాది నుండి ఐఐటి-జెయియి మరియు నీట్ ప్రవేశపరీక్షల కొరకు న్యూఢిల్లీకి చెందిన ఆకాష్ ఐఐటి అండ్ మెడికల్ అకాడమీతో కలిసి కోచింగ్ ఇచ్చేలా నెల్లూరు సరస్వతినగర్‌లో కృష్ణచైతన్య ఐఐటి అండ్ మెడికల్ అకాడమీ ఏసి క్యాంపస్‌ను ప్రారంభిస్తున్నట్లు వారు తెలియజేశారు. ఈ ఏడాది ఐఐటి - జెఇఇ మెయిన్స్ ఫలితాలలో ఆకాష్ విద్యార్థులు జాతీయ స్థాయి ఓపెన్ కేటగిరిలో 1, 4, 11, 16, 26 ర్యాంకులను సాధించినట్లు వారు వెల్లడించారు.

# భగవద్రామానుజుల వారి అవతారోత్సవాలు

## 9న వేడుకగా 28 అడుగుల పుష్పపల్లకి సేవ

నెల్లూరు రంగనాయకులపేటలోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామివారి దేవస్థానం వారి ఆధ్వర్యంలో గతనెల 30 నుంచి ఎంతో భక్తిశ్రద్ధలతో శ్రీ భగవద్రామానుజుల వారి 1002వ అవతారోత్సవాలు జరుగుతున్నాయి. మే 9వ తేది వరకు జరిగే ఈ వేడుకల్లో భాగంగా మే 6వతేది వరకు ప్రతిరోజు ఉదయం సాయంత్రం శ్రీ రామానుజుల వారికి ప్రత్యేకపూజలు సేవలు నిర్వహిస్తారు. ఉదయం 9 గంటలకు స్నపన తిరుమంజనం, వేదపారాయణం, దివ్యప్రబంధ పారాయణం ఉంటాయి. సాయంత్రం 4.30 గంటలకు పేట ఉత్సవం, 6గంటలకు మంగళాశాసనోత్సవం, రాత్రి 7 గంటలకు దివ్యప్రబంధ పారాయణాలు, గోష్ఠిగానం, రాత్రి 8.30 గంటలకు సాత్తుమొరై అనంతరం స్వామివార్ల తీర్థప్రసాద వినియోగం ఉంటాయి. అదేవిధంగా 7వతేది స్వామివారి అవతారోత్సవ కార్యక్రమంలో భాగంగా ఉదయం 7గంటలకు పేట ఉత్సవం, 9 గంటలకు తిరుమంత్రార్థ ప్రవచనాలు, 9.30 గంటలకు తిరుమంజనం, వేద-దివ్యప్రబంధ పారాయణాలు ఉంటాయి. రాత్రి 9 గంటలకు సాత్తుమొరై అనంతరం తీర్థప్రసాద వినియోగం ఉంటుంది. 8వ తేదిన ఉదయం 7.30 గంటలకు పేట ఉత్సవం, 9 గంటలకు మంగళాశాసనోత్సవం, 9.30 గంటలకు తిరుమంజనం, వేద-దివ్యప్రబంధ పారాయణం ఉంటాయి. రాత్రి 7 గంటలకు వేద-దివ్యప్రబంధ పారాయణం, అనంతరం సాత్తుమొరై, తీర్థప్రసాద వినియోగం ఉంటాయి. 9వతేది ఉదయం 6గంటలకు శ్రీ భగవద్రామానుజుల వారికి శ్వేతఛత్రాలతో పేట ఉత్సవం వైభవంగా నిర్వహిస్తారు. 8 గంటలకు మంగళాశాసనోత్సవం జరుగుతుంది. ఈ వేడుకలకు కీర్తిశేషులు మాగుంట గోపాల్‌రెడ్డి-నవనీతమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు ఉభయకర్తలుగా వ్యవహరిస్తారని నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా, ఉదయం 8.30 గంటలకు శ్రీ రంగనాథస్వామివారికి, శ్రీ భగవద్రామానుజుల వారికి నవ కలశాలతో తిరుమంజనం నిర్వహించి, అనంతరం తీర్థప్రసాద వినియోగం చేస్తారు. ఈ కార్యక్రమాలకు శ్రీ బత్తిన కుమారస్వామిరెడ్డి, శ్రీమతి లక్ష్మమ్మ ఉభయకర్తలుగా వ్యవహరిస్తారు. రాత్రి 10 గంటలకు శ్రీ రంగనాథస్వామివారికి అత్యంత వైభవంగా రాష్ట్రంలోనే ఎక్కడాలేనంత వేడుకగా 28 అడుగుల పుష్పపల్లకిలో శ్రీ రంగనాథస్వామివారిని, శ్రీ భగవద్రామానుజుల స్వామివారిని విశేష పుష్పాలంకారాలతో నగరోత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా వేద పారాయణాలు, దివ్యప్రబంధ పారాయణాలతో తెనాలి వారి బ్యాండ్ కచ్చేరీలతో ఈ పుష్పపల్లకీ ఉత్సవాన్ని నయనానందకరంగా నిర్వహిస్తారు. ఈ వేడుకకు కీర్తిశేషులు మాగుంట రాఘవరెడ్డి, సుబ్బరామిరెడ్డిగార్ల జ్ఞాపకార్థం మాగుంట సుధాకరరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, విజయారెడ్డి ఉభయకర్తలుగా వ్యవహరిస్తారని నిర్వాహకులు పేర్కొన్నారు. శ్రీ రంగనాథస్వామి ఆలయ ధర్మకర్తలమండలి ఛైర్మన్ కోట గురుబ్రహ్మం, మండలి సభ్యులు, ఆలయ ఇ.ఓ వేమూరి గోపి పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

# గూడూరు డివిజన్ వార్తలు

### నెల్‌క్యాస్ట్‌లో..

## అగ్నిమాపక అవగాహన సదస్సు




అగ్నిప్రమాదాల నివారణ పట్ల అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి విజయ వరకుమార్

నెల్‌క్యాస్ట్ కంపెనీలో ఇటీవల ఆ కంపెనీ సిబ్బదికి అగ్నిమాపక అధికారి విజయ వరకుమార్ మరియు సిబ్బంది ఆధ్వర్యంలో, అగ్నిప్రమాదాలు నివారించాలంటే ఎలా అనే అంశంపై అవగాహన సదస్సుతో పాటు మాక్‌డ్రిల్ నిర్వహించారు. అగ్ని ప్రమాదాల పట్ల నెల్‌క్యాస్ట్ సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆ కంపెనీ జిఎం (ఆపరేషన్స్) ఎన్ఎస్ రెడ్డి, జి.ఎం (ఫైనాన్స్) దువ్వూరు రవీంద్రనాథ్‌రెడ్డి, నెల్‌క్యాస్ట్ సెక్యూరిటీ అధికారి పి.రామ్మోహన్, డిజిఎం (హెచ్ఆర్) టి.మురళీకృష్ణ, కంపెనీ పిఆర్ఓ ఆనిమెళ్ళ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

**- 7వ అదనపు జిల్లా న్యాయమూర్తి శాంతి**




సమాజంలో జరుగుతున్న నేరాలను నివారించాలంటే ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని 7వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎన్.శాంతి సూచించారు. గూడూరు పట్టణంలోని ఉప కారాగారంలో న్యాయసేవాధికారసంస్థ ఆధ్వర్యంలో సోమవారం న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ, మహిళలపై జరుగుతున్న యాసిడ్ దాడులను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు కోటేశ్వరరావు, హరనాథ్‌ప్రసాద్, జైలు సూపరింటెండెంట్, సిబ్బందితో పాటు ఖైదీలు పాల్గొన్నారు.

### పదోన్నతుల్లో...

## అన్యాయం జరిగితే సహించం

**- షేక్ రియాజ్ అహ్మద్**



పంచాయతిరాజ్ డిప్లొమో ఇంజినీరింగ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ పదోన్నతుల్లో ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలని, అన్యాయం జరిగితే సహించేది లేదని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ రియాజ్ అహ్మద్ అన్నారు. రాజమండ్రిలో ఆదివారం ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ.ఇల సర్వీసులను రెగ్యులర్ చేసి, సీనియారిటీ లిస్టును ఆమోదించాలని, ప్రతి ఏ.ఇ కి ఇద్దరు సైట్ ఇంజనీర్లను కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ప్రతినిధులు హనుమంతరావు, కేశవులు, కృష్ణమూర్తి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## వాచ్‌మెన్ కుటుంబానికి ఆర్థికసాయం



వెంకటేశ్వర్లు కుటుంబసభ్యులకు నగదు అందజేస్తున్న క్లబ్ ప్రధాన కార్యదర్శి మల్లు విజయకుమార్‌రెడ్డి, సభ్యులు

గూడూరు పట్టణంలోని ముత్యాలపేటలో ఉన్న పిఆర్‌క్లబ్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ ఇటీవల హఠాన్మరణానికి గురైన వెంకటేశ్వర్లు కుటుంబానికి క్లబ్ సభ్యులు చేయూతనందించారు. కమిటీ ప్రధాన కార్యదర్శి మల్లు విజయకుమార్‌రెడ్డి, సహచర కమిటీ సభ్యులతో కలసి సోమవారం మృతుని కుటుంబసభ్యులకు లక్షరూపాయల నగదును అందజేసి తమ వితరణను చాటుకున్నారు. ఈ సందర్భంగా మల్లు విజయకుమార్ మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న మృతుని కుటుంబానికి ఆర్థికసాయం చేసిన క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి పి.విజయకుమార్, సభ్యులు రమణబాబు, శ్రీధర్‌రెడ్డి, జనార్ధన్ రెడ్డి, పులిమి శివకుమార్, బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కన్నులపండువగా..

## శ్రీ సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం



గూడూరు పట్టణంలోని శివాలయం వీధిలో ఉన్న మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామివార్ల కల్యాణం కన్నులపండువగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారిని, అమ్మవార్లను సుగంధ భరిత పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేసి కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ వేడుకలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివార్ల కల్యాణం తిలకించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది.

### ఆంధ్ర మహిళామండలి ఆధ్వర్యంలో

## పేదలకు దుస్తులు పంపిణీ



పేదలకు దుస్తులు అందజేస్తున్న డాక్టర్ సి.రోహిణి తదితరులు

గూడూరు మండలంలోని చవటపాళెం పుచ్చలపల్లి సుందరయ్య కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఆదివారం గూడూరు ఇన్నర్‌వీల్‌క్లబ్, ఆంధ్రమహిళామండలి ఆధ్వర్యంలో పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సేవాగుణాన్ని అలవరచుకోవాలన్నారు. పేదలకు సేవ చేయడం తమకెంతో సంతోషంగా ఉందన్నారు. ఈ వేసవిలో ఎండలు మండిపోతున్నందున ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీలక్ష్మి, జీవని, విష్ణువందన తదితరులు పాల్గొన్నారు.

# లోకేష్.. అనే నేను...

గల్పిక 2

జరిగిన కథ: ఉండవల్లిలోని లింగమనేని గెస్ట్‌హౌస్‌లో ఫన్నీస్టార్ లోకేష్ దిగాలుగా కూర్చుని వుంటాడు. బ్రాహ్మణి వచ్చి ఎందుకలా వున్నారని అడుగుతుంది. అప్పుడే అటు వచ్చిన మంత్రులు, తెలుగు దేశం నాయకులు కూడా లోకేష్‌కు ఏమైందని అడుగుతారు. లోకేష్ వారికి... ఎన్నికల్లో గెలుస్తామో లేదోననే భయంతో చంద్రబాబు ఈసీని, ఈవిఎంలను అదేపనిగా తిడుతున్నాడని, ఒకవేళ రేపు ఆయన ఓడిపోయి సీఎం కుర్చీ దిగి పోవాల్సి వస్తే ఆయన మానసికంగా కృంగిపోతాడని అదే నా బాధ అని చెబుతాడు. అప్పుడు మంత్రి సోమిరెడ్డి కలుగజేసుకుని ఎన్నికల ఫలితాలపై నుండి చంద్రబాబు దృష్టి మళ్లించడానికి ఏం చేస్తామన్నది 'దూకుడు' సినిమాలో లైవ్‌షో మాదిరిగా ఊహా చిత్రం చూపిస్తుంటాడు. 2019 మే 23న కౌంటింగ్ జరగడం ఫలితాలు రావడం, కేంద్రంలో బీజేపీ యేతర పార్టీలకు, రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీకి మెజార్టీ రావడం, చంద్రబాబు ప్రధాని కావాలని అన్ని ప్రాంతీయ పార్టీల నేతలు కోరడం జరుగుతుంది. అలాగే లోకేష్‌ను ముఖ్యమంత్రిని చేయాలని కార్యకర్తలు ఆందోళన చేస్తుంటారు. తెలుగుదేశం నాయకులతో కలిసి ఈ సన్నివేశాలన్నింటిని చంద్రబాబు టీవీలో తిలకిస్తుంటాడు. ఆంధ్రాభోజుడు అంటే ఎవరు అని నారాయణ అడిగిన ప్రశ్నకు ఆంధ్రామెస్‌లో భోజనం చేసేవాడిని ఆంధ్రభోజుడు అంటారని ఎమ్మెల్సీ యలమంచిలి బాబూరాజేంద్రప్రసాద్ చెబుతాడు.

ఆ తర్వాత...

సాయంత్రం 4గంటలు... కేంద్రంలో, రాష్ట్రంలో పూర్తి ఫలితాలు వచ్చాయి. కాంగ్రెస్‌తో కలిసి బీజేపీయేతర పార్టీలకు 312సీట్లు వచ్చాయి. అందులో టీడీపీకే 21సీట్లు. రాష్ట్ర శాసనసభలో టీడీపీ 131సీట్లతో తిరుగులేని ఆధిక్యం సాధించింది. సాయంత్రం 5గంటలు... అమరావతిలో చంద్రబాబు ప్రెస్‌మీట్ పెట్టాడు. అందరు మీడియా ప్రతినిధులు హాజరయ్యారు. చంద్రబాబు మాట్లాడుతూ... ఇది ప్రజాస్వామ్య విజయం. నియంతృత్వ శక్తులపై లౌకికవాదుల గెలుపిది. ఎలక్షన్ కమిషన్ బాగా పని చేసింది. ఈవిఎంల ద్వారా ఎన్నికలు నిర్వహించబట్టే ఎన్నికలు సాఫీగా జరిగి ప్రజాస్వామ్య పార్టీలు గెలిచాయి. ఈరోజే ఢిల్లీకి పోతున్నాను. అందరం కలిసి కూర్చుని ప్రధాని అభ్యర్థిని నిర్ణయిస్తాం అని చెప్పాడు. వెంటనే చంద్రజ్యోతి విలేకరి భజన భుజంగరావు లేచి... సార్, ఇప్పటికే మిగిలిన పార్టీల నాయకులంతా మిమ్మల్ని ప్రధానిగా కోరుకున్నారు కదా, మళ్ళీ అందరూ కలిసి కూర్చుని నిర్ణయం తీసుకోవడమేంటి...? అని అడిగాడు. దానికి చంద్రబాబు... ఏదైనా ప్రజా స్వామ్య పద్ధతిలో జరగాల్సిందే అని బదులిచ్చాడు. మరి మీరు ప్రధానిగా ఎన్నికైతే రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎవరిని నియమిస్తారు? మీరు ప్రధానిగా వెళితే ఈ రాష్ట్రంలో ప్రపంచ మేటి నగరాలను తలదన్నేలా నిర్మితమవుతున్న అమరావతి రాజధాని భవిష్యత్ ఏంటి? అత్యంత తక్కువ ఖర్చుతో శరవేగంగా కట్టబడు తున్న పోలవరం ప్రాజెక్ట్ పరిస్థితేంటి? రాష్ట్రానికి వస్తున్న లక్షల కోట్ల పెట్టు బడులు ఏమైపోవాలి. లక్షల ఉద్యోగాలు ఏమైపోతాయని ఆందోళన వ్యక్తం చేశాడు. దానికి చంద్రబాబు... నో ప్రాబ్లమ్ బ్రదర్... అన్నింటికి లోకేష్ వున్నాడు... నాకంటే బాగా పరిపాలి స్తాడు. రాష్ట్రాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళతాడు. ప్రధానిగా దేశం కోసం నేను, సీఎంగా ఏపి కోసం లోకేష్... అభివృద్ధిలో పోటీ పడబోతున్నాం అని చెప్పి ప్రెస్‌మీట్ ముగించాడు.

తర్వాత చంద్రబాబు ఆయన వెంట కొత్తగా ఎన్నికైన ఎంపీలను తీసుకుని ఢిల్లీకి చేరుకున్నాడు. ఢిల్లీలోని టెన్‌జన పథ్‌లో బీజేపీయేతర పార్టీల సమావేశం... అన్ని పార్టీల నాయకులు, ఎంపీలు హాజరైవున్నారు. అప్పుడే చంద్ర బాబు అక్కడకు వచ్చాడు. ఆయనను చూడగానే సోనియాగాంధీ మంగళ హారతితో స్వాగతం పలికింది. స్టాలిన్, దేవేగౌడ, ఫరూక్ అబ్దుల్లా, మాయావతి, అఖిలేష్‌యాదవ్, మమతా బెనర్జీలు చంద్రబాబును ఆలింగనం చేసుకుని... మీ దయవల్లే, మీరు చేసిన ప్రచారం వల్లే మేము మా రాష్ట్రాలలో మెజార్టీ సీట్లు గెలుచుకున్నాం... అంతా మీ దయ, మా ప్రాప్తం అని చెప్పారు. తర్వాత అందరూ సమావేశమయ్యారు. ప్రధానిగా ఎవరిని ఎన్నుకోవాలనే దానిపై చర్చ మొదలైంది. మమతా బెనర్జీ లేచి... బీజేపీని ఓడించ డంలో ప్రధానపాత్ర చంద్రబాబు గారిదే... కాబట్టి ఈసారికి ఆయననే ప్రధానిని చేద్దాం అని ప్రతిపాదించింది. అప్పుడు అందరూ చప్పట్లుకొట్టారు. ఆ సౌండ్‌కు మంచి నిద్రలో వున్న దేవే గౌడకు టక్కున మెలకువ వచ్చి ఆయన కూడా చప్పట్లు కొట్టాడు. చప్పట్లు కొట్టడం అయిపోయాక... ఇంతకీ ఎందుకు చప్పట్లు కొట్టారని స్టాలిన్‌ను అడిగాడు. స్టాలిన్ జరిగిన విషయం చెప్పాడు. వెంటనే దేవేగౌడ లేచి... ప్రధానిగా చంద్రబాబుకు నేను మద్దతునిస్తున్నాను. ఎందుకంటే... గతంలో నన్ను ప్రధానిగా చేసి నా రాజకీయ భవిష్యత్‌ను సంకనాకిచ్చింది ఆయనే... దానికి కృతజ్ఞతగా నేను కూడా ఆయనను ప్రధానిని చేయాలనుకుం టున్నాను అని చెప్పాడు. ఆ మాటకు అందరూ చప్పట్లు కొట్టారు.

★★★★★

అమరావతిలోని టీడీఎల్పీ భవనం. తెలుగుదేశం ఎమ్మెల్యేలందరూ కలిసి నారా లోకేష్‌ను శాసనసభపక్ష నేతగా ఎన్నుకున్నారు.

★★★★★

గుంటూరులోని నాగార్జున విశ్వ విద్యాలయం ఎదురుగా విశాలమైదానం. సీఎంగా లోకేష్ ప్రమాణస్వీకారోత్సవం. గవర్నర్ నరసింహన్ స్టేజీ మీద వున్నాడు. ఆయనకు ఓవైపు లోకేష్... లోకేష్ చేత గవర్నర్ సీఎంగా ప్రమాణస్వీకారం చేయిస్తున్నాడు. లోకేష్ ప్రమాణస్వీకారం మొదలుపెడుతూ 'లోకేష్ అనే నేను'... అనే మాట అనగానే సభాప్రాంగణం చప్పట్లతో మార్మోగిపోసాగింది.

★★★★★

... ఈ పాయింట్ వద్ద లోకేష్.... ఇక ఆపండి... మీ ఊహాచిత్రం చాలా అద్భుతంగా వుంది. అయినా ఇవన్నీ ఎలా సెట్ చేస్తారని సోమిరెడ్డిని అడిగాడు. దానికి సోమిరెడ్డి... ఇప్పటికే డైరక్టర్స్ రాజమౌళి, శ్రీను వైట్లతో మాట్లాడాను... సెట్టింగ్స్, డూప్‌యాక్టర్స్‌తో అన్ని సీన్‌లు వాళ్ళే అరెంజ్ చేస్తారు. ఫలితాలు ఎలావున్నా నాన్నను హ్యాపీగా వుంచే బాధ్యత నాది అని హామీ ఇచ్చాడు. దాంతో లోకేష్ మనసు కుదుటపడింది.

(సమాప్తం)

# ప్రకృతి సేద్యంతోనే మానవ మనుగడ

## - వ్యవసాయశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న రాజశేఖర్, జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు తదితరులు

ప్రకృతి సేద్యమే లక్ష్యంగా ముందుకు సాగాలని, వ్యవసాయ రంగంలో కొత్త దనానికి ప్రాముఖ్యతనిస్తూ వినియోగ దారులకు కల్తీ లేని ఆహారాన్ని అందిం చడమే ధ్యేయంగా అందరూ కృషి చేయా లని వ్యవసాయశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ అన్నారు.

గతనెల 29న నెల్లూరులోని మినీ బైపాస్‌రోడ్డులోని పరమేశ్వరి కల్యాణ మండపంలో ఖరీఫ్-2019ని అమలు చేయాల్సిన వివిధ పథకాలపై ఎంపిఇఓల నుంచి జడ్పీ ఇ.ఓల స్థాయి వరకు ఉన్న అధికారులకు జిల్లాస్థాయిలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూమి పచ్చదనంతో కళకళలాడాలన్నా, మానవాళి మనుగడ సాఫీగా సాగాలన్నా, మంచి లాభాలతో రైతులు అభివృద్ధి చెందాలన్నా పెట్టుబడి లేని ప్రకృతి సేద్యాన్ని అనుసరించాలన్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పుల వల్ల ప్రకృతి వైపరీత్యాలు సంభ వించనున్నాయని తెలిపారు. అందువల్ల పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని స్పష్టం చేశారు. పంటల సాగుకోసం మన దేశంలో రైతులు విపరీతంగా పురుగు మందులు, ఎరువులు వాడుతుండడంతో భూమి సారాన్ని కోల్పోతోందని, అందువల్ల పెట్టుబడి లేని ప్రకృతి సేద్యం చేయడం ద్వారా మంచి ఫలితాలు పొందవచ్చని అన్నారు. సహజసిద్ధమైన ఎరువులతో సేద్యం చేయడంవల్ల నాణ్యమైన, ఆరోగ్య వంతమైన ఆహారపదార్థాలను మానవాళికి అందించవచ్చున్నారు. ప్రకృతి వ్యవసాయ అధికారులు, ఎంపిఓలు ఆ మేరకు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం 26 వేల ఎకరాల్లో ప్రకృతి సేద్యం జరుగు తోందని, దీనిని మరింతగా పెంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్రవ్యవసాయశాఖ కమిషనర్ మురళీరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని, రానున్న ఖరీఫ్ సీజన్‌లో కార్యాచరణ ప్రణాళికలను పటిష్ఠంగా అమలుచేయాలని అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు మాట్లాడుతూ ఈ అవగాహన సదస్సులో పలు అంశాలపై విస్తృతంగా చర్చించుకుని అధికారులు తగు అవగాహన పెంపొందించుకోవాలన్నారు. వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ సత్యనారాయణ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి సేద్యంపై కరపత్రాలను, గోడపత్రికలను ఆవిష్కరించారు. వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు ప్రసాద్, శైలేశ్వరి పాల్గొన్నారు.

# నేత్రపర్వంగా శ్రీవారి కల్యాణోత్సవం

నెల్లూరు బాలాజీనగర్‌లోని సీతారామ మందిరం ప్రాంగణంలోని శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో గతనెల 27 న శ్రీవారి జన్మనక్షత్రం శ్రవణం సందర్భంగా శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారి కల్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు తిరుమంజనం, పంచామృతాభిషేకాలు, నవస్నపన తిరుమంజనం సేవలు నిర్వహించారు. భక్తుల గోవిందనామ స్మరణలతో, మేళతాళాలతో, మంగళ వాయిద్యాలతో స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ ధర్మకర్తమండలి అధ్యక్షుడు, సభ్యులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

## న్యాయవాదులు కఠోర శ్రమతో

# జాతీయస్థాయిలో గుర్తింపు పొందాలి

## - హైకోర్టు న్యాయమూర్తి సోమయాజులు

న్యాయవాదులు కఠోర శ్రమతో జాతీయస్థాయిలో గుర్తింపు పొందాలని హైకోర్టు న్యాయమూర్తి డివియస్‌యస్ సోమయాజులు ఆకాంక్షించారు. గతనెల 27 న నెల్లూరు జిల్లా కావలి బార్ అసోసియేషన్ వార్షికోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రకాశనం గావించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన తండ్రి డివి సుబ్బారావు విశాఖపట్నంలో సాధారణ న్యాయవాదిగా జీవితం ప్రారంభించి బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ గా ఎదిగారన్నారు. జూనియర్ న్యాయవాదులు సీనియర్ న్యాయవాదుల సహకారంతో ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. తన జీవితంలో న్యాయమూర్తిగా నరసారావుపేటకు చెందిన ఒక న్యాయవాది వినిపించిన ఆర్గ్యుమెంట్ ఉత్తమమైనదిగా భావిస్తున్నానని తెలిపారు. ది కావలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గద్దె మాల్యాద్రి సభకు అధ్యక్షత వహించారు. జిల్లా న్యాయమూర్తి డి.వెంకటకృష్ణయ్య మాట్లాడుతూ న్యాయవ్యవస్థ నీతివంతంగా పనిచేస్తూ ప్రజల్లో నమ్మకాన్ని పెంచాలన్నారు. స్టేట్ బార్ కౌన్సిల్ మెంబర్ వేనాటి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ న్యాయవాదులు పుస్తక జ్ఞానంతో పాటు ప్రాక్టికల్‌గా ఉండాలన్నారు. సీనియర్ న్యాయవాది ఖలీంరోజ్ దార్ మాట్లాడుతూ 132 సంవత్సరాల చరిత్ర కలిగిన కావలి కోర్టు పాతభవనాన్ని పరిరక్షించాలన్నారు. సీనియర్ సివిల్‌జడ్జి కె.శైలజ, జూనియర్ జడ్జి పి.జానిబాషా, బార్ అసోసియేషన్ కార్యదర్శి కె.ఎలీషాబాబు, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.






## కోలాహలంగా మే డే...
# రెపరెపలాడిన ఎర్రజెండా

మేడే సందర్భంగా ఈనెల 1న నెల్లూరు జిల్లా ఎరుపురంగుతో కళకళలాడింది. కార్మిక శక్తి కదం తొక్కింది. వామపక్ష పార్టీలకు చెందిన కార్యకర్తలు, అనుబంధ సంఘాలు భారీ ప్రదర్శనలు నిర్వహించారు. పలుచోట్ల జెండా ఆవిష్కరణలు చేశారు. ఈ సందర్భంగా కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య జయంతి కార్యక్రమాలను జిల్లాలో ఘనంగా నిర్వహించారు. కార్మికులు, కర్షకులు, వామపక్ష ప్రజాసంఘాలు నాయకులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రాంతాల్లో జెండాలను ఎగురవేశారు. సీపీయం నగర కమిటీ ఆధ్వర్యంలో నెల్లూరు లోని బోసుబొమ్మ సెంటర్ నుంచి ట్రంకురోడ్డు, వీఆర్సీ సెంటర్, చిన్నబజార్ మీదుగా ములుమూడి బస్టాండ్ వరకు కార్మికులు భారీ ప్రదర్శన నిర్వహించారు. సీపీయం రూరల్ కమిటీ ఆధ్వర్యంలో బొల్లినేని సెంటర్ నుంచి కేవీఆర్ పెట్రోలు బంకు, ఆర్టీసీ బస్టాండ్ మీదుగా ఏసీ కూరగాయల మార్కెట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీయం జిల్లా కార్యదర్శి చంద్ర రాజగోపాల్ మాట్లాడుతూ చికాగో నగరంలో కార్మికులు 8 గంటల పని కోసం పోరాడి రక్తతర్పణం చేసారని, ఆ రక్తంలో నుంచి ఎర్రజెండా పుట్టిందన్నారు. సీపీఎం నగర, రూరల్ కార్యదర్శులు మూలం రమేష్, మాదాల వెంకటేశ్వర్లు, సిఐటీయూ జిల్లా కార్యదర్శి కె.అజయ్‌కుమార్, అధ్యక్షులు కత్తి శ్రీనివాసులు, జి.నాగేశ్వరరావు, ఎస్ కె మస్తాన్‌బీ, పి.చంద్రారెడ్డి, ఎ.శ్రీనివాసులు, మూలం ప్రసాద్, ఆర్.శ్రీనివాసులు, పి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### గూడూరులో...



ప్రపంచ కార్మికుల దినోత్సవం సందర్భంగా మేడే వేడుకలు గూడూరులో బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలు పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో పలు కూడళ్ళలో కార్మికజెండాను ఆవిష్కరించారు. కార్మికుల ఐక్యత వర్ధిల్లాలంటూ నినాదాలు చేస్తూ కార్మిక శక్తిని సమాజానికి చాటిచెప్పారు. స్థానిక కూరగాయల మార్కెట్ ప్రాంతంలో సిపిఐ నాయకులు కార్మికులతో కలిసి ఎర్రజెండాను ఆవిష్కరించారు. అనంతరం మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కాలేషా, సివిఆర్ కుమార్, గౌస్‌బాషా తదితరులు పాల్గొన్నారు. సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో నాయకులు కార్మికులతో కలిసి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. నాయకులు యాదగిరి, కేశవులు, మణి, శివకుమార్, రమణయ్య, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

# స్నేహానికి మరోపేరు.. ఈదూరు

## - నవ్వుతూ.. నవ్వించే.. డాక్టర్ సుధాకర్ ఇక లేరు


డాక్టర్ ఈదూరు సుధాకర్

***ప్రజావైద్యుడు, ప్రముఖ కవి, చిత్రకారుడు.. సేవాతత్పరుడు.. అన్నిటికీ మించి అందరికీ ఎంతో ఆత్మీయుడు.. స్నేహానికి మరోపేరుగా నిలచిన డాక్టర్ ఈదూరు సుధాకర్ (62) ఇక లేరు. గతనెల 27వ తేదీ అర్ధరాత్రి సమయంలో నెల్లూరు శాంతినగర్‌లో ఉన్న తన నివాసంలో గుండెపోటుకు గురికావడంతో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించారు. సుధాకర్ మృతితో ఆయన కుటుంబం శోకసంద్రమైంది. ఈ విషాదవార్తతో బంధువులు, మిత్రులంతా కన్నీటిపర్యంతమయ్యారు.***

చిన్నా పెద్దా, బీద గొప్ప అనే తేడా లేకుండా అందరితో ఎంతో కలివిడిగా మాట్లాడుతూ, ప్రతిఒక్కరితో ఎంతో ఆత్మీయంగా ఉంటూ అందరి అభిమానాన్ని పొందిన ప్రజావైద్యుడు డాక్టర్ సుధాకర్ మరణించారంటే ఎవరికీ నమ్మబుద్ది కాలేదు. ఎప్పుడూ నవ్వుతూ.. జోక్స్ వేస్తూ అందరినీ నవ్విస్తూ ఎంతో సరదాగా మాట్లాడే డాక్టర్ ఈదూరు ఇలా హఠాన్మరణానికి గురికావడం అందరినీ విషాదానికి గురిచేసింది. ఎంతోమంది ఆయన మిత్రులు, సహచరులు, బంధువులు శోకతప్తులయ్యారు.

### 18 ఉత్తమ సేవా అవార్డులు...

ఉత్తమ ప్రజావైద్యునిగా, మంచికవిగా, అద్భుతమైన చిత్రకారునిగా, లాఫింగ్ క్లబ్ వ్యవస్థాపకునిగా సుమారు మూడు దశాబ్దాలపాటు ఆయా రంగాల్లో నిరుపమానమైన సేవలందించి సింహపురి సీమకు గర్వకారణంగా నిలిచారు. విశిష్టమైన తన సేవలతో ఉత్తమ వైద్యాధికారిగా ఆయన జిల్లా కలెక్టర్ తదితర ఉన్నతాధికారుల నుంచి 18సార్లు అవార్డులను కూడా అందుకున్నారంటే అతిశయోక్తి కాదు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్‌కు, రెడ్‌క్రాస్ రక్తనిధికి విశేషమైన సేవలందించారు. తానెక్కడ పనిచేసినా ప్రజాసేవా దృక్పథంతోనే పనిచేశారు. స్వతహాగా తాను డయాబెటాలజిస్ట్ కావడంతో డయాబెటిస్ ఉన్న పిల్లలకు మానవతాదృక్పథంతో సుమారు పదేళ్ళుగా ఉచితంగా ఇన్సులిన్ పంపిణీ చేసి తన సేవానిరతిని చాటుకున్నారు. ఎంత చికాకులోనైనా ఆయన ముఖంలో చిరునవ్వు చెరిగేది కాదు... సీరియస్‌గా ఉండడమన్నది ఆయనకు తెలియదు. జీవితంలో ఎన్ని కష్టనష్టాలెదురైనా నవ్వుతూనే ఎదుర్కొనేవారు. తన కష్టాలన్నిటినీ సంతోషంగా ఆయనలోనే దాచుకునేవారు.. నవ్వులను మాత్రం అందరికీ పంచేవారు. అదే ఆయన సహజ గుణం. అందరితోనూ ఆత్మీయంగా ఉంటూ.. అందరి అభిమానాన్ని పొందడం ఆయన సుగుణం.

### మంచితనమే పరమావధిగా...

తొలినుంచి అభ్యుదయభావాలతో ఉండడం, సమాజానికి తనవంతు సేవలందించాలనే మంచి మనసు ఉండడం, ఆ మంచితనమే పరమావధిగా.. ఎప్పుడూ ఎవరినుంచి ఏదీ ఆశించకుండా సమాజానికి తనవంతు సేవలందించడం డాక్టర్ సుధాకర్ జీవనశైలి. బీదసాదలకు ఉచితంగా వైద్యం అందిస్తుండేవారు. డబ్బు సంపాదనే జీవితపరమార్థంగా భావించే ఈ రోజుల్లో అత్యంత తక్కువ ఫీజుతోనే వైద్యం చేసే డాక్టర్ ఎవరైనా ఉన్నారా అంటే..వారిలో ప్రముఖంగా డాక్టర్ సుధాకర్‌నే చెప్పుకోవచ్చు. అల్లూరు మండలంలోని సింగపేటలో జన్మించి, అల్లూరు రామకృష్ణా జూనియర్ కళాశాలలో చదువుకుని, తర్వాత కర్నూలు మెడికల్ కళాశాలలో వైద్యవిద్య పూర్తిచేసి.. అనంతరం వైద్య వృత్తిలో రాణిస్తూ తొలుత అల్లూరులో ప్రజావైద్యశాలను నిర్వహించారు. ఆ తర్వాత నెల్లూరు రామచంద్రారెడ్డి ఆసుపత్రిలో చేరి ప్రజావైద్యులు డాక్టర్ జెట్టి శేషారెడ్డి వద్ద ఉంటూ దాదాపు పదేళ్ళపాటు వైద్యసహాయకునిగా పనిచేశారు. ఆ తర్వాత ప్రభుత్వోద్యోగం రావడంతో జగదేవిపేట ప్రాథమికవైద్యశాల డాక్టర్‌గా చేరారు. అక్కడి నుంచి 2017 సంవత్సరం దాకా వైద్యరంగంలో వివిధ హోదాల్లో పనిచేసి డిప్యూటీ డిఎం అండ్ హెచ్‌ఓగా ఉద్యోగ విరమణ చేశారు.

### సాహితీ రంగంలోనూ ప్రముఖ సేవ...

నెల్లూరుజిల్లా రచయితల సంఘం వ్యవస్థాపక సభ్యునిగా సుమారు 15 ఏళ్ళపాటు ఆయన అపారమైన సేవలందించారు. సాహితీరంగంలోనూ విశేష కృషిచేసి ఎన్నో అవార్డులను, ప్రముఖుల ప్రశంసలను అందుకున్నారు. ప్రముఖ నవలా రచయిత యండమూరి వీరేంద్రనాథ్ నుంచి అవార్డును అందుకున్నారు. ఇటీవలే రచించిన 'శ్వేతగులాబీతోట' వచన కవితా సంపుటిని కూడా యండమూరి వీరేంద్రనాథ్ చేతుల మీదుగా నెల్లూరు పురమందిరంలో ఆవిష్కరించారు. అంతే కాదు, డాక్టర్ సుధాకర్ అద్భుతమైన చిత్రకారుడు కూడా! స్పాట్ పెయింటింగ్‌లో గోల్డ్‌మెడల్ పొందిన చిత్రకారుడాయన. నెల్లూరు జిల్లా చిత్రకళారంగానికి కూడా ఆయన తనవంతు సేవలందించారు.

### అంతిమ నివాళులు...

డాక్టర్ సుధాకర్‌కు భార్య, ఒక కుమారుడు ఉన్నారు. సోమవారం ఉదయం ఆయన బంధువులు, స్నేహితులు, ఎంతోమంది వైద్యులు, వివిధ సంస్థలవారు, వేలాదిమంది అభిమానుల వేదనారోదనల మధ్య, కన్నీటి నివాళుల మధ్య సోమవారం నాడు ఆయన అంత్యక్రియలు జరిగాయి.

అందరినీ శోకతప్తులను చేసిన డాక్టర్ సుధాకర్..తన జ్ఞాపకాల నీడలను మాత్రం ఇక్కడ వదిలిపెట్టి వెళ్ళిపోయాడు. తన చెంతకు వచ్చిన మృత్యువును కూడా పకపకా నవ్వించి...ఇక ఏ ఆటుపోట్లు..ఎలాంటి గుండెపోట్లు లేని.. ఏ దూర సుదూర తీర సరోవరాలవతలికో.. వెళ్ళిపోయాడు. తానొక్కడే కాదు.. తానెంతో ఇష్టపడే నవ్వులను కూడా వెంటబెట్టుకుని మరీ వెళ్ళిపోయాడు.

## 5న గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్ష

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్ష ఈనెల 5న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు నిర్వహిస్తున్నట్లు డీఆర్వో సి. చంద్రశేఖర్‌రెడ్డి గత నెల 30న విలేకర్లకు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 14,998 మంది హాజరుకానున్నారని, దీనికోసం 31 కేంద్రాలను ఏర్పాటు చేశామని నెల్లూరు నగరంలో 22, కావలిలో 6, గూడూరులో 3 కేంద్రాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ పరీక్ష కోసం జిల్లా వ్యాప్తంగా 17 రూట్‌లలో 17 మంది లైజనింగ్ అధికారులు, 31 మంది అసిస్టెంట్ లైజనింగ్ అధికారులను నియమించినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రంలోకి ఉదయం 9 గంటల నుంచే అనుమతించడం జరుగుతుందని, 10 గంటల తర్వాత ఎవరినీ అనుమతించరన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉండనున్న దృష్ట్యా ప్రత్యేక భద్రతాచర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఏపీపీఎస్సీ జారీ చేసిన హాల్ టిక్కెట్లలో పొందుపరచిన విధంగా అభ్యర్థులు సంబంధిత ధృవీకరణ పత్రాలు తమ వెంట తప్పనిసరిగా తెచ్చుకోవాలని, పరీక్షా కేంద్రంలోకి క్యాలికులేటర్లు, సెల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించరని తెలిపారు.

### జేఈఈ మెయిన్స్‌లో..
# ప్రభుత్వ విద్యార్థులు సత్తా చాటారు
**- జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు**

జేఈఈ మెయిన్స్‌లో జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు రికార్డు స్థాయిలో ర్యాంకులు సాధించి విజయకేతనం ఎగురవేశారని జిల్లా కలెక్టర్ రేవు ముత్యాలరాజు పేర్కొన్నారు. గత నెల 30 న నెల్లూరులోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ మొత్తం 318 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 185 మంది ఉత్తీర్ణత సాధించడం జిల్లాకు గర్వకారణమన్నారు. మెయిన్స్‌లో ఉత్తీర్ణత సాధించిన వారిలో కనీసం 100 మంది విద్యార్థులకు ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీల్లో సీట్లు లభించే అవకాశం ఉందన్నారు. నెల్లూరులోని మునిసిపల్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ నుంచి 35 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 24 మంది మెయిన్స్‌లో అర్హత సాధించారన్నారు. సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కాలేజీలు, ఏపీఆర్ జేసీలో చదివిన విద్యార్థులు సత్తాచాటారన్నారు. కార్పొరేట్ కాలేజీల్లో 40 శాతానికి మించి జేఈఈ మెయిన్స్‌లో ఉత్తీర్ణులు కారని, జిల్లాలోని ప్రభుత్వ రెసిడెన్షియల్ కాలేజీల్లో 58 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడం గర్వకారణమన్నారు.

### ముగిసిన..
# టెన్త్ మూల్యాంకనం

నెల్లూరులోని సెయింట్ జోసెఫ్ ఇంగ్లీషుమీడియం పాఠశాలలో జరుగుతున్న పదవ తరగతి మూల్యాంకనం గత నెల 27న ముగిసింది. పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థుల జవాబు పత్రాలు, ఇతర జిల్లాల నుంచి వచ్చిన 5,33,000 జవాబు పత్రాలను దిద్దారు. ఈ కార్యక్రమంలో 1600 మంది సిబ్బంది పాల్గొన్నారు.

అనంతరం వీటిని రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయానికి పంపనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

పది ఫలితాలను మే నెల రెండవ వారంలో విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

# ఆ(వే)ట మొదలైంది!

## అరెస్ట్‌కు భయపడి హైకోర్టును ఆశ్రయించిన పందుల వీరుడు



ఏప్రిల్ 11 ఎన్నికల ముందురోజుల్లో ఒక్క నిముషమైనా చంద్రబాబునాయుడు పోయి పోయి ఈ మోడీతో ఎందుకు పెట్టుకున్నానురా అని మనసులో అయినా మదనపడివుంటాడు. మోడీని వదులుకుని ఎంత తప్పు చేశాడో ఆయన బహిరంగంగా చెప్పలేకపోవచ్చు గాని, మనసులో మాత్రం అనుకుని వుంటాడు. ఎన్నికల సమయంలో బీజేపీతో వైరం చంద్రబాబుకు సినిమానే చూపించింది. తెలుగుదేశం ఆర్ధిక పునాదులను దెబ్బతీసే ప్రక్రియ విజయవంతంగా జరిగింది. ఎన్నికల ముందంతా జరిగిన ఐటి దాడులతో తెలుగుదేశం ఆర్ధికవేత్తల చేతులు, కాళ్ళు కట్టేసినట్లయ్యింది. ఎన్నికల్లో కోట్లు వెదజల్లి ఓట్లు కొనుక్కోవాలనుకున్న టిడిపి నాయకుల అంచనాలు తలక్రిందులయ్యాయి. సరైన సమయంలో అభ్యర్థులకు డబ్బులు చేరలేదు. టీడీపీ అభ్యర్థులు స్థానికంగా ఎక్కడికక్కడ అప్పులు చేసి ఎన్నికల్లో ఖర్చుపెట్టారు.

ఇవన్నీ ఒకెత్తయితే చంద్రబాబు కోటరీలో ప్రధాన నాయకుడు ఎంపీ సుజనాచౌదరి కోసం సిబిఐ వేట మొదలైంది. మారిషస్ బ్యాంకుతో పాటు ఆయా బ్యాంకులకు ఆయన వేలకోట్లలో బాకీ వున్నాడు. బ్యాంకుల నుండి తీసుకున్న ఋణాలను నకిలీ పేర్లతో దారి మళ్లించాడనే ఆరోపణలున్నాయి. వీటి మీదే సిబిఐ విచారణకు హాజరు కావాలని ఆయనకు నోటీసులు జారీ చేయగా, సిబిఐ అరెస్ట్‌కు భయపడి నాలుగురోజులు అడ్రస్ లేకుండా దాక్కుని సిబిఐ తనపై విచారణ చేయకుండా ఆపాలంటూ హైకోర్టును ఆశ్రయించాడు. సుజనాకు బాబు బినామీగా పేరుంది. టిడిపికి పెద్ద పెట్టుబడిదారుడు. రెండుసార్లు రాజ్యసభకు వెళ్ళగలిగింది వందలకోట్లు ఖర్చుపెట్టబట్టే. ఈ వందలకోట్లు బ్యాంకుల ఋణాలే! 2014లోనే కేంద్రమంత్రివర్గంలో సుజనా పేరును ప్రతిపాదించాడు చంద్రబాబు. అయితే సుజనా ఆర్ధిక నేరాల చిట్టాను చంద్రబాబు ముందు పెట్టి ఆయనను తన కేబినెట్‌లోకి తీసుకోలేదు మోడీ! అయితే మంత్రివర్గ విస్తరణలో పైరవీల ద్వారా సుజనా కేంద్రమంత్రి కావడం, ఆ తర్వాత బీజేపీతో తెగదెంపులయ్యాక ఆ పదవికి రాజీనామా చేయడం జరిగింది. ప్రత్యేకహోదా ఉద్యమాన్ని పందుల ఆటతో పోల్చిన పెద్దమనిషి ఈయనే!

పాపాలు, నేరాలు చేసిన వాళ్లెవరూ తప్పించుకోలేరు. కాకపోతే వాళ్ళవంతు టైం వచ్చేదాకా వెయిట్ చేయాలంతే! ఈరోజు సుజనా... రేపటి రోజున ఇంకెందరు ఆర్ధికనేరగాళ్ళో.... వేట మొదలైంది. ఆట అలాగే సాగుతోంది.

# రాష్ట్రం దివాలా

(మొదటి పేజీ తరువాయి)

చేయడం కష్టసాధ్యమే. వీటిని కష్టం మీద అమలు చేయగలిగినా ఇక రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఒక రోడ్డేయడానికి గాని, ఒక కాలువ తవ్వడానికి గాని నయాపైసా వుండదు. అభివృద్ధి పనులపై పూర్తిగా ఆశలు వదులుకోవాల్సిందే!

ఈరోజు రాష్ట్ర ఆర్ధిక వ్యవస్థ ఇంత దివాళాకోరు స్థితిలో వుండడానికి కారణం ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఐదేళ్ళ పాలనే! ఈ 5ఏళ్లలో ఆయన రాష్ట్ర సంపదను పెంచకపోగా చేసిన దుబారాతో రాష్ట్ర ఆర్ధిక వ్యవస్థ కుదేలయ్యింది. ప్రతి అంశంలోనూ దుబారా, అవినీతి రాజ్యమేలాయి. ఒక పుష్కరాలైతేనేమీ, ఒక పోలవరం అయితేనేమీ, తాత్కాలిక భవనాల కోసమైతేనేమీ, విదేశీ పర్యటనలు, సొంత రాష్ట్రంలోనే స్పెషల్ ఫ్లైట్‌లు, పోలవరం సందర్శన పేరుతో ట్రిప్‌లు... ఇలా ఒకటేమిటి, చెప్పలేనంత దుబారా, ఆడంబరాలు రాష్ట్ర ఆర్ధిక వ్యవస్థకు పెనుభారంగా మారాయి. ప్రజలు పోలవరం సందర్శనకు ప్రభుత్వం పెట్టిన ఖర్చు 400కోట్లు. ఈ ఖర్చుతో ఇస్రోవాళ్ళు రాకెట్లు తయారు చేసి ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపుతున్నారు. మధ్యప్రదేశ్ సీఎం దావోస్ పారిశ్రామిక సదస్సుకు వెళితే అయిన ఖర్చు కోటి 80లక్షలు, అదే మన ఐటిశాఖ మంత్రి వెళితే అయిన ఖర్చు 18కోట్లు. ఇలాంటి ఉదాహరణలు చాలావున్నాయి. 2014లో తెలుగుదేశం అధికారంలోకి రాకముందు రాష్ట్రంపై వున్న అప్పు 90వేల కోట్లు. ఇప్పుడు అది 2లక్షల 50వేల కోట్లయ్యింది. ఆర్‌బిఐలో ఓవర్ డ్రాఫ్ట్ లిమిట్ దాటిపోయింది. కేంద్రం ఇచ్చిన నిధులన్నీ పక్కదారి మళ్ళించడం అయిపోయింది. ఇక ఎన్నికలకు ముందు కేవలం రెండునెలల కాలంలో తీసుకున్న పింఛన్‌ల పెంపు, పసుపు-కుంకుమ, అన్నదాత సుఖీభవ వంటి ప్రభుత్వ డబ్బుతో ఓట్ల కొనుగోలుకు చేసిన ఖర్చు 29వేలకోట్లు. వీటి కోసం ఖజానాను ఊడ్చిపెట్టారు. ఈ పథకాలతోనే రాష్ట్ర ఖజానాలో చిల్లిగవ్వ లేక రేపు నెలలో జీతాలన్నా వస్తాయా లేదా అని ఉద్యోగులు ఆందోళన చెందే పరిస్థితులు వచ్చాయి.

### ఎల్.వి తవ్వకాలతో దడ...

ఐదేళ్ల చంద్రబాబు పాలనలో జరిగిన ఆర్ధిక వ్యవహారాలు, నగదు లావాదేవీలు, కేటాయింపులు, అంచనాల పెంపు, చెల్లింపులు వంటి అంశాలపై కొత్త సి.ఎస్ ఎల్.వి.సుబ్రహ్మణ్యం పూర్తిస్థాయిలో లోడుతున్నట్లు తెలుస్తోంది. ఆయన జరిపే ఈ తవ్వకాలలో తెలుగుదేశం ప్రభుత్వంలో జరిగిన ఎన్ని అవినీతి అక్రమాల పురావస్తు శిథిలాలు బయటపడనున్నాయో చూడాలి!? ఈ ఐదేళ్ళు అధికారం వుందికదా అని చంద్రబాబు ఐఏఎస్ అధికారులతో ఆడుకున్నాడు. ఇప్పుడు ఒకేఒక్క సిన్సియర్, సీనియర్ ఐఏఎస్ అధికారి దెబ్బకు చంద్రబాబుకు జ్వరం కాస్తోంది.

# బడి కాదు.. పేదల గుడి

ప్రభుత్వ విద్యావ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమై కార్పొరేట్ విద్య రాజ్యమేలుతున్న నేటి కాలంలో నెల్లూరులోని ఓ నగరపాలక సంస్థ హైస్కూల్ మాత్రం వీటికి భిన్నంగా కార్పొరేట్ విద్యా సంస్థలనే తలదన్నేలా మంచి ఫలితాలను సాధిస్తూ, అక్కడ సీటు దొరకడమే మహాప్రసాదం అన్నట్లుగా పనిచేస్తోంది.



దాదాపు 30ఏళ్ళ క్రితం వరకు కూడా ప్రభుత్వ విద్యాలయాలే ఎక్కువగా వుండేవి. వాటిలోనే ధనిక, పేద తేడా లేకుండా అందరి పిల్లలు చదువుకునేవాళ్ళు. సర్కార్ బడుల్లో చదివే వాళ్ళే పాలిటెక్నిక్ ఎంట్రన్స్ వ్రాసేవాళ్ళు, ఎంసెట్ వ్రాసేవాళ్ళు, ఇతర పోటీ పరీక్షలకు వెళ్ళేవాళ్ళు. వాళ్ళే ర్యాంకులు, సీట్లు, ఉద్యోగాలు సంపాదించేవాళ్ళు.

అప్పటికీ ఇప్పటికీ తేడా ఒకటే! అప్పుడు ప్రభుత్వ బడుల్లో చదివినోళ్ళు ర్యాంకులు కొట్టేవాళ్ళు... ఇప్పుడు కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదివినవాళ్ళు ర్యాంకులు కొడుతున్నారు. విద్యార్థులు వాళ్లే... కాకపోతే అప్పట్లో ఏడాదికి వంద, రెండొందలు ఫీజులు కట్టి ప్రభుత్వ బడుల్లో చదివి ర్యాంకులు తెచ్చుకునేవాళ్ళు. ఇప్పుడు లక్షల్లో కార్పొరేట్ విద్యాసంస్థలకు ఫీజులు కట్టి అవే ర్యాంకులు తెచ్చుకుంటున్నారు.

ర్యాంకులు, మార్కులు తెచ్చుకోవాలంటే కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదివించాల్సిందే అన్నంతగా సమాజంలో పైత్యం పెరిగింది. ఎవరన్నా తమ పిల్లలను జడ్పీ స్కూళ్ళలో చదివిస్తుంటే... వారిని చుట్టుపక్కల వాళ్ళు మీ బిడ్డల భవిష్యత్‌ను ఎందుకు నాశనం చేస్తున్నారన్నట్లుగా చిన్నచూపు చూస్తున్నారు. సమాజంలో ఈ రకమైన భావాలు పెరిగిపోయి, పనికి ఉపాధి హామీ పథకం క్రింద రోజూ పనికివెళ్ళే వాళ్లు కూడా తమ పిల్లలను ప్రైవేట్ బళ్ళకు పంపుతున్నారు.

ప్రభుత్వ విద్య పూర్తిగా నిర్వీర్యమైపోతోంది. ప్రభుత్వ బడులు అలంకారప్రాయంగా మారుతున్నాయి. మన రాష్ట్రంలో విద్యావ్యవస్థ ఎంతగా ప్రైవేటీకరణ చెందిందనడానికి ఉదాహరణ గత పాతికేళ్ళలో రాష్ట్రంలోనే ఎక్కడా కొత్తగా ఒక కొత్త ప్రభుత్వ పాఠశాల నిర్మాణం జరిగిన దాఖలాలు లేవు. ప్రభుత్వ విద్యావ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమై కార్పొరేట్ విద్య రాజ్యమేలుతున్న నేటి కాలంలో నెల్లూరులోని ఓ నగరపాలక సంస్థ హైస్కూల్ మాత్రం వీటికి భిన్నంగా కార్పొరేట్ విద్యా సంస్థలనే తలదన్నేలా మంచి ఫలితాలను సాధిస్తూ, అక్కడ సీటు దొరకడమే మహాప్రసాదం అన్నట్లుగా పనిచేస్తోంది.

**ప్రతి ప్రభుత్వ విద్యాలయం ఇలా వుంటే... పేద, మధ్య తరగతి కుటుంబాలకు లక్షల రూపాయలు ఆదా!**

### కెఎన్‌ఆర్ హైస్కూల్...

కురుగంటి నాగిరెడ్డి నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల... నెల్లూరు, బి.వి. నగర్‌లోని రైల్వేగేటును ఆనుకుని వుంటుంది. గత మూడేళ్ళుగా పదో తరగతిలో అద్భుత ఫలితాలు సాధిస్తోంది. ప్రతిఏటా 200 మందికి పైగా విద్యార్థులు పదో తరగతి పరీక్షలు వ్రాస్తుండగా నూరు శాతం ఉత్తీర్ణతతో పాటు పదికి పది, పదికి తొమ్మిది వంటి గ్రేడ్‌లతో అత్యధిక శాతం విద్యార్థులు ఉత్తీర్ణులవుతుండడం విశేషం.

మంచి విద్యాబోధన, మంచి ఫలితాలు, మంచి బోధనా సిబ్బంది ఉండడం వల్లే ఈ హైస్కూల్‌లో సీట్లు దొరకడం కష్టతరంగా మారింది. సీట్ల కోసం ఎమ్మెల్యేల రికమెండేషన్‌లకు కూడా వెళుతున్నారు. ప్రస్తుతానికి 6వ తరగతిలో మాత్రమే అడ్మిషన్‌లు ఇస్తున్నారు. వీటిలో కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులకే మొదటి ప్రాధాన్యతనిస్తున్నట్లు కెఎన్‌ఆర్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు విజయ్‌ప్రకాశ్‌రావు తెలిపారు.

**సీట్లు లేవు...** 'సీట్లు లేవు' అంటూ కెఎన్‌ఆర్ స్కూల్ ముందు పెట్టిన బోర్డు మీడియాలోనూ, సోషల్ మీడియాలోనూ విస్తృతంగా ప్రచారమైంది. ఇక్కడ విషయం ఏంటంటే... ప్రభుత్వ బడుల్లో కెఎన్‌ఆర్ స్కూల్ ఒక్కటే ఎందుకిలా వుండాలి... అన్ని ప్రభుత్వ స్కూళ్ళు కెఎన్‌ఆర్ స్కూల్ మాదిరిగా ఎందుకు తయారు కాకూడదు... ఎందుకంటే ప్రతిస్కూల్‌లోనూ అర్హతగల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు వున్నారు. కెఎన్‌ఆర్ స్కూల్ టీచర్లులాగే వాళ్ళూ జీతాలు తీసుకుంటున్నారు. మరి కెఎన్‌ఆర్ స్కూల్ ఉపాధ్యాయ సిబ్బందిలాగే మిగతా స్కూళ్ళ సిబ్బంది కూడా పనిచేస్తే ప్రతి స్కూల్ కూడా కెఎన్‌ఆర్ స్కూల్‌లాగే అవుతుంది. పేద, మధ్య తరగతి కుటుంబాలలో ఏడాదికి ఒక్కో కుటుంబానికి వేలరూపాయలు మిగులుతాయి కదా!

## నాబార్డ్ ఏజిఎంగా రవిసింగ్



కలెక్టర్‌ను కలిసిన రవిసింగ్

నాబార్డ్ ఏజిఎంగా రవిసింగ్ 1వ తేదీ నెల్లూరులోని తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ముంబై నాబార్డ్ ప్రధాన కార్యాలయంలో పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. బాధ్యతల స్వీకరణ అనంతరం జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇక్కడ ఏజిఎంగా వున్న రమేష్ బాబు విజయవాడకు బదిలీ అయ్యారు.

## బారకాసు శ్రీరామ మందిరంలో విశేషపూజలు

శ్రీరామనవమి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని నెల్లూరు నగరంలోని బారకాసు సెంటర్‌లో కొలువైవున్న శ్రీరామ మందిరంలో గతనెల 26వ తేది రాత్రి స్వామివారికి విశేషపూజలు చేసి ఏకాంతసేవ నిర్వహించారు. ఈ వేడుకలో భాగంగా విష్ణు సహస్రనామ భక్తబృందం ప్రతినిధి శైలజ ఆధ్వర్యంలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. అనంతరం భక్తులందరికీ అన్నప్రసాద వితరణ జరిగింది. ఆలయ ఛైర్మెన్ చాకిరాల శేషయ్య కుటుంబసభ్యులు ఈ వేడుకలకు ఉభయకర్తలుగా వ్యవహరించారు. కార్యదర్శి వరిగొండ సురేష్‌బాబు, ఆలయ ధర్మకర్తలు గ్రోసు మురళీకృష్ణ, మయూరి సుబ్బారావు, వీరిశెట్టి సుధాకర్‌రావు, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

## మహనీయుల జయంతులను పండుగలా జరుపుకోవాలి

భారతదేశంలో గర్వించదగ్గ మహనీయులు మహాత్మా జ్యోతిరావ్ పూలే(ఏప్రిల్11), భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్(ఏప్రిల్ 14), భారత మాజీ ఉపప్రధాని జగ్జీవన్‌రామ్(ఏప్రిల్ 5)ల జయంతులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సెలవు దినంగా ప్రకటించాలని ఏపి దళిత సేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి అరవ పూర్ణప్రకాష్ డిమాండ్ చేశాడు. గత నెల 30వ తేదీ నెల్లూరు అంబేద్కర్‌భవన్‌లో ఏపి దళిత విద్యార్థిసేన, ఏపి దళితసేన నేతృత్వంలో జరిగిన మరవద్దు.. మరవద్దు.. మహనీయులను మరవద్దు అనే కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడాడు.

# కుటుంబాలకు అండగా నిలవండి

- ఆదాల



కుట్టు శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

ఆదాల ట్రస్ట్ ద్వారా కుట్టు శిక్షణ పొందిన వారు ఆ విద్యతో తమ కుటుంబాలకు అండగా నిలవాలని మాజీమంత్రి ఆదాల ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ నెల 1వ తేదీన నెల్లూరురూరల్ మండలం మాదరాజు గూడూరు పల్లెపాలెంలో ఆదాల ట్రస్ట్ ద్వారా కుట్టు శిక్షణ పొందిన మహిళలకు ఆయన సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడుతూ కుటుంబ పోషణకు ఉపయోగపడినప్పుడే నేర్చుకున్న ఏ శిక్షణకైనా సార్థకత ఉంటుందన్నారు. 1997లో ఆదాల ఛారిటబుల్ ట్రస్ట్‌ను ప్రారంభించామని, అల్లూరు, బోగోలు మండలా లలో ఎక్కువగా సేవా కార్యక్రమాలు నిర్వహించామని గుర్తు చేశారు. సముద్రతీర గ్రామాల్లో చాలామందికి చర్మ, కంటికి సంబంధించిన జబ్బులు రావడంతో వారి కోసం పెద్ద ఎత్తున ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించామన్నారు. కుట్టుశిక్షణ పొందిన వారికి ఇప్పుడు మంచి అవకాశాలున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, పి.కోటేశ్వరరెడ్డి, మల్లు సుధాకర్‌రెడ్డి, ఝాన్సీ, జీవన్ ప్రసాద్, ట్రస్ట్ కో-ఆర్డినేటర్ పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పి.కె-3



రాష్ట్రంలో ఎన్నికలు ముగిసిన తర్వాత పి.కె-3 అనే ప్రచారం ఎక్కువగా జరుగుతోంది. ఈసారి రాష్ట్రంలోని మూడు పార్టీలలోనూ పి.కె ప్రభావం వుంది. తెలుగుదేశం పార్టీ పరంగా పి.కె అంటే పసుపు, కుంకుమ. ఎన్నికలకు మూడు నెలలముందు సీఎం చంద్రబాబు 90లక్షల మంది డ్వాక్రా మహిళల కోసం పసుపు - కుంకుమ స్కీం తెచ్చారు. దీని క్రింద 10వేల రూపాయలను నాలుగు విడతల్లో ఇచ్చేలాగా చెక్కులు ఇచ్చారు. అలాగే సెల్‌ఫోన్‌లు ఇచ్చారు. తెలుగుదేశం వాళ్ళు తమ ఐదేళ్ళ పాలనపై నమ్మకంతో గెలుస్తామనుకోవడం లేదు. ఎన్నికలకు మూడు నెలల ముందు ప్రకటించిన పసుపు - కుంకుమ పైనే గంపెడాశలు పెంచుకుని వున్నారు. పోలింగ్‌బూత్‌లోకి వచ్చిన ప్రతి మహిళ సైకిల్ గుర్తు మీదే నొక్కిందన్న నమ్మకంతో వున్నారు. తమ పార్టీ గెలుపు కోసం 'పసుపు-కుంకుమ'ను తప్పితే ఇంకే అంశాన్ని టిడిపి వాళ్ళు నమ్మడం లేదు.

వైసిపిలో పి.కె అంటే ప్రశాంత్‌కిషోర్. రాజకీయ వ్యూహకర్త. ఈ ఎన్నికల్లో వైసిపికి జగన్ ప్రజాకర్షణ ఎంతగా ఉపయోగ పడిందో ప్రశాంత్ కిషోర్ వ్యూహాలు, ఆయన రూపొందించిన ప్రచార సరళి పార్టీకి అంతగా ఉపయోగపడ్డాయి. 2014లో బీజేపీకి ప్రశాంత్‌కిషోర్ వ్యూహకర్తగా వ్యవహరించడం తెలిసిందే! దాదాపు రెండేళ్ళుగా ప్రశాంత్ కిషోర్ బృందం రాష్ట్రంలో సర్వేలు నిర్వహిస్తూ, ప్రజల నాడి తెలుసుకుంటూ, ప్రజలకు ఏం కావాలో తెలుసుకుంటూ వైసిపి తరపున పకడ్బందీగా ఎన్నికల వ్యూహాన్ని రచించింది. ఈ ఎన్నికల్లో వైసిపి పరంగా ప్రశాంత్ కిషోర్ బృందం అనిర్వచనీయమైన పాత్రనే పోషించింది.

ఇక మూడోది జనసేన పి.కె. ఆ పార్టీ అధినేత పేరు పవన్‌కళ్యాణ్‌తోనే పి.కె. అని వచ్చింది. ఆ పార్టీ అధికారంలోకి రాలేకపోవచ్చు. ఓట్లు - సీట్లు ఎన్ని సాధించినా అది కేవలం పవన్‌కళ్యాణ్‌ను చూసి వచ్చినవే కాని, ఇంకోటి కాదు. ఈ ఎన్నికల్లో జనసేన ఏం సాధించినా అది పి.కె. పవన్‌కళ్యాణ్ ప్రభావమే!

## నెల్లూరులో...
# ముగిసిన అంతర్జాతీయ చదరంగం పోటీలు

ఇప్పటివరకు నెల్లూరులో జాతీయ స్థాయి క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్ వంటి పోటీలు నిర్వహించడం చూశాం. కాని, జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు వేదికగా అంతర్జాతీయ స్థాయి పోటీలను నిర్వహిస్తుండడం ఎంతైనా అభినందనీయం. గత నెల 22వ తేదీ నుండి 26వరకు నెల్లూరు, పినాకినినగర్‌లోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి భవన్‌లో ఈ అంతర్జాతీయ చెస్ పోటీలను నిర్వహించగా దేశంలో 22 రాష్ట్రాలకు చెందిన దాదాపు 270మంది అంతర్జాతీయ చెస్ క్రీడాకారులు ఈ పోటీలకు విచ్చేయడం విశేషం. ఈ టోర్నీలో రాజేష్ ప్రథమ బహుమతిని, చక్రవర్తిరెడ్డి ద్వితీయ బహుమతి, బాలచంద్రప్రసాద్ తృతీయ స్థానాన్ని, బాలకిషన్ నాలుగో స్థానాన్ని, భరత్‌కుమార్‌రెడ్డి 5వ స్థానాన్ని సాధించారు. అలాగే 27, 28, 29తేదీలలో రామ్మూర్తినగర్‌లోని గుడిగంట్ల బాల పీరయ్య కళ్యాణ మండపంలో బి-కేటగిరిలో అంతర్జాతీయ ఫిడే రేటింగ్ చెస్ పోటీలు నిర్వహించగా ఈ టోర్నీలో ఏపికి చెందిన ఫణి 8పాయింట్లతో విజేతగా నిలిచాడు. అలాగే తమిళనాడుకు చెందిన జి.కేశవన్ ద్వితీయ స్థానాన్ని, ఏపికి చెందిన ఎండి ఇమ్రాన్ తృతీయ స్థానాన్ని సాధించారు. అలాగే గోపాలకృష్ణన్, శ్రీనివాసరెడ్డి, సుధీర్‌ఆచార్య, రఘురామిరెడ్డి, లోకప్రకాష్, భరతకోటి స్నేహ, సిద్ధిక్ అక్బర్, బాలగణేశన్, గౌరీశంకర్, సతీష్‌కుమార్, వెంకటేశన్, చిన్నదొరై, తిరుమురుగన్, ప్రవీణ్, దైవదర్శన్, లోకేష్, భరత్‌వేణుగోపాల్‌లు వరుస స్థానాలు దక్కించుకున్నారు. జిల్లా చెస్ అసోసియేషన్ వ్యయప్రయాసలకోర్చి ఈ టోర్నీని నిర్వహించడం అభినందనీయం.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

## మా కృషితోనే...
# చెరువులకు జలకళ

- సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



తెలుగుదేశం ప్రభుత్వం చిత్తశుద్ధితో చేసిన కృషివల్లే ఇంత ఎండాకాలంలోనూ పొదలకూరు మండలంలో చెరువులు నీళ్ళతో కళకళలాడుతున్నాయని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 2వ తేదీన ఆయన పొదలకూరు మండలంలోని నరసింహకండ్రిక, కనుపర్తిచెరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో ముచ్చటిస్తూ 60శాతానికి పైగా లోటు వర్షపాతంతో ఈ ఏడాది తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నప్పటికీ శ్రీశైలం నుండి 48.5 టిఎంసీల కృష్ణా జలాలను సోమశిలకు తీసుకుని వచ్చి పంటలను కాపాడామని, సోమశిల పరిధిలో 3లక్షల ఎకరాలలో పంట పండించడంతో పాటు కండలేరు పరిధిలో తాగునీటి అవసరాలను తీర్చామన్నారు. దశాబ్దాలుగా మూలన పడివున్న కండ్లేరు ఎత్తిపోతల పథకాన్ని 62కోట్లతో సాకారం చేసి రైతులకు అందుబాటులోకి తెచ్చి, ఈ వేసవిలోనూ పొదలకూరు మండలంలోని చెరువులకు నీళ్ళు అందించగలిగామన్నారు. ఈ నీళ్ళతోనే నిమ్మ తోటలను కాపాడామని, వచ్చే సీజన్‌కు ఇటు కండ్లేరు ఎత్తిపోతల పథకం, అటు దక్షిణ కాలవ ద్వారా 30వేల ఎకరాలకు నీళ్ళందించడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

# రెండు కేంద్రాల్లో రీ పోలింగ్

సూళ్ళూరుపేట నియోజకవర్గంలో ఒకటి, కోవూరు నియోజకవర్గంలో ఒకటి... రెండు చోట్ల రీపోలింగ్‌కు ఎన్నికల కమిషన్ ఆదేశించింది. సూళ్ళూరుపేటలోని పోలింగ్‌బూత్-41లో కొంత పోలింగ్ ముగిశాక పార్లమెంటు స్థానం ఈవిఎం మొరాయించింది. దీని స్థానంలో మరో ఈవిఎంను ఏర్పాటు చేశారు. అయితే రెండు ఈవిఎంలను స్ట్రాంగ్ రూమ్‌లో కాకుండా ఒక దానినే స్ట్రాంగ్ రూమ్‌లో పెట్టి మరోదానిని రిజర్వ్‌డ్ ఇవిఎంల స్ట్రాంగ్ రూమ్‌లో వుంచారు. జరిగిన పొరపాటును గుర్తించి అధికారులు రిజర్వ్‌డ్ స్ట్రాంగ్ రూమ్‌లో వున్న ఈవిఎంను స్ట్రాంగ్‌రూమ్‌లోకి మార్చి భద్రపరిచారు. అయితే దీనిపై తిరుపతి పార్లమెంట్ టిడిపి అభ్యర్థి పనబాక లక్ష్మి ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. దీనిపై విచారించిన ఎన్నికల సంఘం రీపోలింగ్‌కు ఆదేశించింది. అలాగే బుచ్చి మండలం ఇస్కపల్లిలోని 197వ బూత్‌లో పార్లమెంటు ఈవిఎం మొరాయింపు కారణంగా రీ పోలింగ్‌కు ఆదేశించారు. ఈ రెండుబూత్‌లలోనూ ఈ నెల 6వ తేదీ ఉదయం 7గంటల నుండి సాయంత్రం 6గంటల వరకూ పార్లమెంటు స్థానానికి మాత్రమే పోలింగ్ జరుగనుంది.




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com